# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

30 ఏళ్ళ ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026

# వార్త

## ఎలక్ట్రిక్ బస్సు డిపో నిర్మాణం పనులను

## పరిశీలించిన ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్

తిరుపతి క్రైమ్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త



తిరుపతి జిల్లా పర్యటన భాగంగా విచ్చేసిన ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు మంగళం డిపోలో జరుగుతున్న ఎలక్ట్రిక్ బస్సు డిపో నిర్మాణం పలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రిక్ బస్సు డిపో నిర్మాణం పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులను ఆరా తీసి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం తిరుపతి బస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. బస్ స్టేషన్‌లో పారిశుద్ధం, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీరు, ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్వహణలో సిబ్బంది అలసత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత నిర్వాహుకులకు వెంటనే నోటీసులు జారీ చేయాలని ఏటీఎంను ఆదేశించారు.

# విషాదం

- ముగ్గురు మేస్త్రీలు, కూలీలు మృతి, ఆరు మందికి తీవ్ర గాయాలు
- శిధిలాల కింద చిక్కుకుని అల్లాడిన క్షతగాత్రులు
- గుడిపాల మండలం మండికృష్ణాపురం సమీపంలో ఘటన
- క్షతగాత్రులను తమిళనాడు అడుకుంబారై ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలింపు



గుడిపాల, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:

నూతన చర్చి నిర్మాణం కోసం వెళ్ళిన మేస్త్రీలు, కూలీలను ఒక్కసారిగా మృత్యువు కబళించడంతో వారు తిరిగిరాని లోకాలకు చేరుకున్నారు. గుడిపాల మండలం మండికృష్ణాపురం హరిజన వాడకు సమీపంలో తమిళనాడు రాష్ట్ర సరిహద్దులో నిర్మాణ దశలో వున్న చర్చి గురువారం ఒక్కసారిగా కూలిపోవడంతో చర్చి నిర్మాణ పనులకు వెళ్ళిన ముగ్గురు మేస్త్రీలు, కూలీలు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో తమిళనాడు రాష్ట్రంకు చెందిన ఒకరు, గుడిపాల మండలంకు చెందిన ఇద్దరు జాన్, శామ్యూల్, ఇమాన్యూల్‌లు మృతి చెందారు. వివరాలిలా వున్నాయి. మండికృష్ణాపురం హరిజనవాడకు సమీపంలో తమిళనాడు రాష్ట్ర సరిహద్దులో కాట్పాడి కెకె నగర్ ప్రాంతంలో నిర్వాహకులు కొత్త చర్చి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ చర్చి నిర్మాణ పనులను డేవిడ్ అనే మేస్త్రీ 48 మంది మేస్త్రీలు, కూలీలతో గత కొన్ని రోజులుగా నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం కొత్త చర్చి నిర్మాణంకు సంబంధించి మోల్డింగ్ పనులు చేశారు. ఉదయం నుండి 48 మంది కూలీలు చర్చి నిర్మాణంకు సంబంధించి మోల్డింగ్ వేసి అలసిపోయారు. సమయం సాయంత్రం 5 గంటలు కావస్తున్న నేపథ్యంలో మేస్త్రీలు కూలీలు మోల్డింగ్ పనులు ముగించుకుని కిందికి వచ్చారు. ఈ క్రమంలో ఒక్కసారిగా కింద నిల్చొని వున్న మేస్త్రీలు, కూలీలపై కొత్తగా మోల్డింగ్ వేసిన కాంక్రీట్ కూలి పడటంలో చాలా మంది కాంక్రీట్ శిధిలాల్లో చిక్కుకుని విలవిలలాడారు. ఒక్కసారిగా మోల్డింగ్ కూలిపోవడం, కింద మేస్త్రీలు, కూలీలు చిక్కుకొని ఆర్తనాదాలు చేయడంతో అక్కడికి పెద్దసంఖ్యలో స్థానికులు చేరుకుని పరిస్థితిని గుర్తించి సహాయ సహకారాలు చేశారు. ఈ పరిస్థితుల్లో సమాచారం తెలుసుకున్న చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, చిత్తూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎంసి విజయానందరెడ్డిలు సంఘటనా స్థలంకు చేరుకుని క్షతగాత్రులకు రక్షించడానికి ప్రయత్నించారు. అలాగే సమాచారం అందుకున్న చిత్తూరు డిఎస్పీ వెంకట నారాయణ, చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్‌నాయుడు, గుడిపాల ఎస్ఐ శ్రీకాంత్‌లు సంఘటనా స్థలం చేరుకుని పోలీసుల సహాయంతో క్షతగాత్రులను రక్షించడానికి చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను తమిళనాడు అడుకంబరై ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అలాగే తమిళనాడు రాష్ట్రం తిరువలం పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరువలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో పాటు క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించడానికి చర్యలు తీసుకున్నారు. మృతి చెందిన ముగ్గురి మృతదేహాలను తిరువలం పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తిరువలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆరుగాలాల రైతుల కష్టాన్ని...అప్పన్నంగా తీసుకెళ్ళాడు

వరి బస్తాలను తీసుకెళుతున్న దృశ్యం



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

ఆరుగాలం కష్టించి పంటను పండించాం. కల్లాంలోంచే సరకు తీసుకెళ్ళాడు. ఏడాదిగా ఇంటి చుట్టు తిరుగుతున్నా అదిగో ఇదిగో అంటూ తిప్పుకొని కుటుంబంతో సహా పరారైనట్లు రైతులు జిల్లా కలెక్టర్‌కు మొరబెట్టుకున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రైతులు పండించిన పంటను అప్పుతీసుకొని ఎగొట్టి పరార్ అయిన మిల్లర్ గురించి ఎన్ని సార్లు వారి మిల్లు వద్దకు తిరిగినా పట్టించుకోక పోగా కుటుంబంతో సహా పరారుకావటంతో శ్రీకాళహస్తి మండలం వెంకటాపురానికి చెందిన రైతులు జిల్లా కలెక్టర్‌ను కలసి తమ మొరను విన్నవించుకున్నారు. దాంతో స్పందించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ సంబంధిత పోలీసు సిఐకు ఫోన్ ద్వారా ఆదేశాలివ్వటంతో స్పందించిన రూరల్ పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన తెలిసింది. తొట్టంబేడు మండలం కన్నలికి చెందిన వ్యాపారి నవీన్ రైతులు

### రూ.2కోట్లతో పరారి.. ఏడాదిగా చెల్లింపులు చేయక వేధింపులు

### జిల్లా కలెక్టర్‌కు రైతుల మొర: కేసు నమోదు

పండించిన ధాన్యాన్ని గత ఏడాది ఆగస్టులో కొనుగోలు చేసారు. ఇలా కొనుగోలు చేసిన ధాన్యంను ఆతను అమ్ముకున్నాడు. అయితే రైతులకు సొమ్ములు చెల్లించలేదు. దాంతో ఎన్నో సార్లు రైతులు వారి మిల్లు, ఇంటివద్దకు ప్రదక్షిణలు చేసారు.

**రూ.2కోట్లు బకాయిలు...**

శ్రీకాళహస్తికిచెందిన రైతులు పండించిన పంటలను ఇళ్ళలో నిల్వ చేసుకునే వీలు లేదు. ఇక గోదాములకు తరలించుటకు రైతులు ఇష్టపడరు. దాంతో రైతుల అసహాయస్థితిని గుర్తించిన కొందరు మిల్లర్లు, దళారులు తమ పబ్బం గడుపుకుంటున్నారు. రైతుల నుంచి కల్లాల్లోనే వరి పంటను తీసుకుంటున్నారు. రేపు మాపు అంటూ నెలలు, సంవత్సరాలు గడచినా చెల్లింపులు చేయక రైతులకు టోకారా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో తొట్టంబేడు మండలం కన్నలికి చెందిన ఓ మిల్లర్ నవీన్ రైతుల నుంచి సుమారు రూ.2కోట్ల విలువ చేసే వరి ధాన్యాన్ని కొనుగోలు చేసారు. చెల్లింపులు చేయలేదు. సుమారు 13 నెలలుగా వరి ధాన్యం అందించిన రైతులు ఆతని ఇంటి వద్దకు తిరిగారు. కానీ ప్రయోజనం లేదు. కొంత కాలం వారి కుటుంబసభ్యులు వాయిదాలు కోరారు. అందుకూ రైతులు ఒప్పుకున్నారు. తీరా వారుకూడా చేతులేత్తేసారు. కుటుంబం అంతా కనబడకుండా పోయారు.

**కలెక్టర్‌ను ఆశ్రయించిన రైతులు:**

ఎన్నో సార్లు వ్యాపారి వద్దకు అలాగే పోలీసులను ఆశ్రయించారు. కానీ వరి తీసుకున్న వ్యాపారి చెల్లింపులు చేయక పోగా పోలీసులు పట్టించుకోలేదు. దాంతో రైతులు సుధాకర్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, రాము, చెంచుకృష్ణారెడ్డి, వవెంకటేశ్‌రెడ్డి, రమేష్‌రెడ్డిలు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలసి తమ బాధలను మొరబెట్టుకున్నారు. రైతుల బాధలను విన్న కలెక్టర్ వెంటనే స్పందించారు. సంబంధిత పోలీసు స్టేషన్ సిఐకు ఆదేశాలు జారి చేసారు. దాంతో సిఐ కేసు నమోదు చేసారు. ౦రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట దళారులు తీసుకుపోగా సొమ్ముల కోసం రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోక పోవటంతో చివరకు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది.

## తిరుపతి నుంచి విజయవాడ, రాజమహేంద్రవరానికి

# కొత్త విమాన సర్వీసులు

## వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్




కొత్త విమాన సర్వీసును ప్రారంభిస్తున్న దృశ్యం

రేణిగుంట, సెప్టెంబరు 10 ప్రభాతవార్త.

తిరుపతి(రేణిగుంట) విమానాశ్రయం నుంచి విజయవాడకు ఫ్లైట్ 91 కొత్త విమాన సర్వీసు గురువారం ప్రారంభించారు. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తిరుపతి(రేణిగుంట) విమానాశ్రయంలో సర్వీసును వర్చువల్‌గా ప్రారంభించారు. తొలి ప్రయాణికుడికి విమానాశ్రయ అధికారులు తొలి టిక్కెటు బోర్డింగ్ పాస్ అందజేసి, కేక్ కట్ చేసి సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ తిరుపతి దేశంలోని అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాల్లో ఒకటని తెలిపారు. ప్రతిరోజూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుపతికి వస్తుంటారని చెప్పారు. తిరుపతి నుంచి విజయవాడ, రాజమహేంద్రవరం, హైదరాబాద్ ప్రాంతాలకు నేరుగా విమాన సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణం అందుతుందని చెప్పారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తిరుపతి నుంచి కువైట్ వంటి అంతర్జాతీయ ప్రాంతాలకు నేరుగా విమాన సర్వీసు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఫ్లై 91 సంస్థ నిర్వహించే విమాన సర్వీసు మంగళ, గురు, శని, ఆదివారాల్లో వారానికి నాలుగు రోజులు హైదరాబాద్–తిరుపతి–విజయవాడ–తిరుపతి–హైదరాబాద్ మార్గంలో నడుస్తుంది. ఈ విమానం ఉదయం 7.40 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 8.05 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుపతి నుంచి ఉదయం 8.05 గంటలకు బయలుదేరి 9.15 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. మరల అక్కడి నుంచి ఉదయం 9.45 గంటలకు బయలుదేరి 10.50 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. అదేవిధంగా సోమ, బుధ, శుక్రవారాల్లో వారానికి మూడు రోజులు హైదరాబాద్–తిరుపతి–రాజమహేంద్రవరం–తిరుపతి–హైదరాబాద్ మార్గంలో విమాన సర్వీసు కొనసాగుతుంది. హైదరాబాద్ నుంచి ఉదయం 7.40 గంటలకు బయలుదేరే విమానం 8.05 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుపతి నుంచి బయలుదేరి 9.30 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటుంది. అక్కడి నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి 11.25 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. కొత్త విమాన సర్వీసులతో తిరుపతి నుంచి విజయవాడ, రాజమహేంద్రవరం, హైదరాబాద్ ప్రాంతాలకు ప్రయాణించే భక్తులు, ప్రజలకు మరింత సౌకర్యం కలగనుంది.

# జాతీయ వేదికపై విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమస్యలు

ఉన్నత విద్య పరిస్థితిపై హైదరాబాద్‌లో 15వ జాతీయ సదస్సు

4లో



# పంచాయతీ చార్జ్ లిస్ట్ ఇవ్వని కార్యదర్శులు

### నిబంధనలను పక్కన పెట్టి కొందరు నెలల తరబడి నిరక్ష్యం

### అస్తవ్యస్తంగా మారిన గ్రామపంచాయతీల పాలన




తిరుపతి రూరల్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

బదిలీ ఉత్తర్వులు జారీ అయినప్పటికీ చార్జ్ లిస్ట్, పంచాయతీ రికార్డులను అప్పగించకుండా కాలయాపన చేస్తున్న పంచాయతీ కార్యదర్శుల వ్యవహారం తిరుపతి రూరల్ మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం బదిలీ అయిన అధికారి వెంటనే బాధ్యతలను తదుపరి అధికారికి అప్పగించడం తప్పనిసరి. అయితే ఈ నిబంధనలను పక్కన పెట్టి కొంతమంది కార్యదర్శులు నెలల తరబడి నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్యేకంగా పేరూరు, తుమ్మలగుంట, మల్లంగుంట చిగురువాడ గ్రామపంచాయతీల్లో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. బదిలీ అయినప్పటికీ చార్జ్ లిస్ట్, పంచాయతీ రికార్డులు, నగదు పుస్తకాలు, అభివృద్ధి పనుల వివరాలు తదితరాలను అప్పగించకుండా కాలయాపన చేయడం వల్ల గ్రామ పరిపాలన పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ఈ నిరక్ష్యం కారణంగా పంచాయతీ సిబ్బందికి జీతాల చెల్లింపులు నిలిచిపోవడం, పారిశుధ్య సేవలు దెబ్బతినడం, అభివృద్ధి పనులు నిలిచిపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజలకు అందాల్సిన సేవలు సకాలంలో అందకపోవడంతో గ్రామస్థుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇంకా ఆశ్చర్యకర విషయం ఏమిటంటే, కొందరు కార్యదర్శులు మళ్లీ అదే గ్రామపంచాయతీలో కొనసాగాలనే రాజకీయ ఆశలతోనే చార్జ్ అప్పగింతలను ఉద్దేశపూర్వకంగా వాయిదా వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇది పంచాయతీరాజ్ చట్టానికి వ్యతిరేకమే కాకుండా పరిపాలనా వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎంపీడీవో మరియు ఉన్నతాధికారులు స్పందించకపోవడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెంటనే జిల్లా స్థాయి అధికారులు జోక్యం చేసుకుని, చార్జ్ లిస్ట్ ఇవ్వని కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, గ్రామ పరిపాలనను పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

కుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

కట్టుకున్న భార్యపై భర్త కత్తితో దాడి చేయడంతో ఆమె ఆస్పత్రిపాలైన సంఘటన మండలంలోని రాగిమానుమిట్ట గ్రామంలో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలిలా.. కుప్పం పట్టణంకు చెందిన పాఛా అనే వ్యక్తికి రాగిమానుమిట్టకు చెందిన అమ్రీన్‌తో సుమారు పదిహేను ఏళ్ల క్రితం వివాహమైందన్నారు. వీరికి ముగ్గురు పిల్లలు సంతానం కలిగారు. ఈ నేపథ్యంలో పాఛా తన భార్యపై అనుమానాలు వ్యక్తం చేస్తుండడంతో తరచూ భార్యభర్తల మధ్య గొడవలు జరిగేవన్నారు. భార్య అమ్రీన్‌కు చెందిన సర్టిఫికెట్లు తదితరాలు కాల్చేశాడన్నారు. గురువారం మరలా భార్యభర్తల మధ్య గొడవ చోటుచేసుకోగా పాఛా తన వద్ద ఉన్న కత్తిని అమ్రీన్‌పై విసిరి దాడి చేయగా ఆమె మెడభాగంలో గాయమైంది. ఆమె అరుపులు విన్న గ్రామస్తులు హుటాహుటిన చికిత్స నిమిత్తం కుప్పం ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# ప్రతి కోడిగ్రుడ్డుపై మార్కింగ్

### విద్యార్థుల ఆహారంలో నాణ్యత,

### - పరిమాణం విషయంలో నిర్లక్ష్యం సహించం

### రాష్ట్ర ఫుడ్ కమీషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్



చిత్తూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:

అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పంపిణీ చేసే ప్రతి కోడిగ్రుడ్డుపై మార్కింగ్ వుండాలని రాష్ట్ర ఫుడ్ కమీషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్ ఆదేశించారు. రాష్ట్ర ఫుడ్ కమీషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్ రెండవ రోజు పర్యటనలో భాగంగా గురువారం యాదమరి మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ షాపులను తనిఖీ చేశారు. యాదమరి అంగన్‌వాడీ కేంద్రంను తనిఖీ చేసిన ఫుడ్ కమీషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులకు అందించే ఆహారంకు సంబంధించి నాణ్యత, పరిమాణం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యంను సహించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో స్టాక్ రిజిస్టర్, రికార్డులు, వాస్తవ నిల్వలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం చౌకదుకాణంను తనిఖీ చేసిన ఆయన వినియోగదారులకు నిత్యవర వస్తువులను సకాలంలో అందించాలని ఆదేశించారు. అలాగే కీనాటంపల్లిలో చౌకదుకాణంను తనిఖీ చేసి నిత్యవసర వస్తువులను రేషన్‌కార్డుదారులందరికీ అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్.వెంకటరాయుడు, సివిల్ సప్లై డిఎం లక్ష్మీ, ఐసిడిఎస్ పిడి శ్యామ్ సుగుణ సుందరి, తహసిల్దారు పార్థసారధి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కలెక్టర్లు ప్రజాసేవకు ముందుండాలి

### స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం

### కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు



తిరుపతి, సెప్టెంబర్ 10ప్రభాతవార్త:

జిల్లాలో అభివృద్ధికి జిల్లా కలెక్టర్లు ఈగోలు వదలి ప్రజాసేవకులుగా నిలబడాలని సిఎం చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. తన సొంత జిల్లాలైన తిరుపతి, చిత్తూరుజిల్లాల్లో ఇప్పటివరకు జరిగిన పలు రకాల అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, కొత్త ఫెన్షన్లకోసం దరఖాస్తులు, పిజిఆర్ఎస్ వినతులపై స్పందించిన తీరును సిఎం గణాంకాలతో తెలుసుకున్నారు. సమావేశాలంటే సమీక్షలు కాదని జరిగిన ఫలితాలవైపు పయనిద్దామని సిఎం తనదైన శైలిలో హితవు చేయడంతో కలెక్టర్లు ఆలోచన దిశగా తీసుకెళ్ళారు. ఐఎఎస్, ఐపిఎస్‌లు, మంత్రులు కూడా ప్రజల కోసమే పనిచేద్దామని, నిజమైన ప్రజా సేవకులుగా నిలుద్దామని పేర్కొన్నారు. ఒకే రాష్ట్రం...వన్ మిషన్, ఒకే ఆశయంతో అదే స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మాణం దిశగా పనితీరు సాగించాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అమరావతిలో గురువారం 8వ జిల్లా కలెక్టర్ల సదస్సుకు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత కుమార్ హాజరయ్యారు. ఈ రెండుజిల్లాల్లో నాయకత్వ లక్షణాలు, సుపరిపాలన, అభివృద్ధి మంత్రాలను కలెక్టర్లకు వివరించారు. రాయలసీమ రైజింగ్ కార్యక్రమాలతో అన్ని ప్రాంతాల అభివృద్ధికి బాటలు వేశామన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు నీరందించగలిగితే ప్రజలకు కలిగే సంతోషం వేరుగా ఉంటుందని ఆ దిశగా కలెక్టర్లు ప్రణాళికలు అమలుచేయాలన్నారు. విద్యుత్ టారిఫ్‌లు పెంచకుండానే నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ ఏడాది తీవ్రమైన ఎల్‌నినో కారణంగా లోటు వర్షపాతంతో ప్రజలుయనీటి ఇబ్బందులు పడకుండా అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి సంక్షోభ సమయంలోనే కలెక్టర్ల నాయకత్వ పటిమ బయటపడాలని తెలిపారు. జిల్లాల్లో ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయంటే అభివృద్ధి, పాలన పెండింగ్‌లో ఉన్నట్లేనని సిఎం అన్నారు. తిరుపతి, చిత్తూరుజిల్లాల్లో రెవెన్యూ శాఖలో భూ సమస్యలను కూడా పరిష్కరించారని, ఇంకా బాగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రతి జిల్లాలో గ్రోత్ ఇంజన్లను గుర్తించి సంపద సృష్టించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్లను కోరారు. "మీ హయాంలో ఫలానా జిల్లాలో ఈ మంచి పని చేశామని ప్రతి కలెక్టర్ గర్వంగా చెప్పుకునేలా పనిచేయాలని, కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో అందరం కలిసి స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మాణం కోసం పనిచేద్దామని సిఎం హితవు పలికారు.

1 CTR 2:11 CTR 2.qxd 9/10/2026 11:39 PM Page 1



## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శాంతిపురం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

స్థానిక 132/33కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పారిశ్రామిక వాడకు విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు సందర్భంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉ ంటుందని రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, ఎండి సోమశేఖర్, డిఇ హిమ్మత్ సాగర్ తెలిపారు. శాంతిపురం, రామకుప్పం, వి.కోట మండలాల్లోని 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 7-గంటల మధ్య తాతా ్కలిక అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## తెదేపా సీనియర్ నేత మృతి

శాంతిపురం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



మండలంలోని మఠం పంచాయతీ కెపి మిట్ట గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నేత రసూల్ గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిఎం పిఎ శ్రీకాంత్ గ్రామానికి చేరుకుని రసూల్ మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబీకులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఎంకెపురం గ్రామంలో రోడ్డు సమస్య ఉండడంతో ఆయన గ్రామానికి వెళ్లి రోడ్డును పరిశీలించారు. సమస్య పరిష్కారంకు హామీ ఇచ్చారు.

## గ్రామీణప్రాంతాలకు బస్సులు నడపాలి

కుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త




ప్రయాణీకుల సౌకర్యం దృష్ట్యా మండలంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, రెస్కో డైరెక్టర్ మురళి ఆర్టీసీ డిఎం రవిని కోరారు. గురువారం వారు డిఎంను మర్యాద పూర్వకంగా కలిసి బస్సులు నడపాల్సిన పలు గ్రామీణ రోడ్ల వివరాలు డిఎంకు అందజేశారు. దీనిపై డిఎం సానుకూలంగా స్పందించారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనసన్మానం

బైరెడ్డిపల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంనుంచి జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన హెచ్‌ఎంలు అనిత, సురేఖ, కెజిబివి స్కూల్ పిడిలను గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఇఒలు జనార్ధనరెడ్డి, దేశమ్మ, మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు, ఉపాధ్యాయ సంఘాల నేతలు శశికుమార్, చైతన్యాచారి, జనార్ధనగుప్తా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చిత్తూరును గ్రోత్ కారిడార్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

– ఎపి, తెలంగాణ రాష్ట్రాలకు రైల్వే గేట్వేగా చిత్తూరు – అరక్కోణం-రేణిగుంట 3, 4వ లైన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం – లాజిస్టిక్ హబ్‌గా చిత్తూరు పార్లమెంటు అభివృద్ధి

– ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు




**చిత్తూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అత్యంత ముఖ్యమైన గ్రోత్ కారిడార్‌గా చిత్తూరును తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. అరక్కోణం-రేణిగుంట 3, 4వ లైన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఇది జిల్లా కేంద్రం చిత్తూరుకు చారిత్రాత్మకమైన వరమన్నారు. వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ దిశగా బలమైన అడుగు పడిందన్నారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల మధ్య వ్యూహాత్మకమైన రైల్వే గేట్వేగా రూపుదిద్దుకోనుందన్నారు. జాతీయ ప్రాజెక్టుల విస్తరణలో భాగంగా దేశ వ్యాప్తంగా 5 మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టులను రూ.10,021 కోట్ల పెట్టుబడి, 540 కిమీ పొడవుతో ఎన్డీఏ సర్కారు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా అరక్కోణం-రేణిగుంట 3, 4వ లైన్లకు శ్రీకారం చుట్టిందని, ఈ లైను రూ.1,936 కోట్లతో 77 కిమీ ఏర్పాటు కానుందన్నారు. అరక్కోణం-రేణిగుంట 3, 4వ లైన్లు చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పుత్తూరు గుండా రూపుదిద్దుకోనుందన్నారు. ఈ లైను ఏర్పాటుతో చెన్నై-రేణిగుంట-తిరుపతి-చిత్తూరు మార్గంలో రద్దీ తగ్గి, కొత్త రైళ్ళు నడపడానికి, ప్రస్తుత రైళ్ళ సమయపాలన మెరుగుపడటానికి అవకాశం లభిస్తుందన్నారు. అలాగే చిత్తూరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల వ్యూహాత్మక గేట్‌వే కానుండటంతో ఇక్కడ పరిశ్రమలు, వేర్‌హౌస్‌లు, లాజిస్టిక్ పార్కులు, కోల్డ్ స్టోరేజ్‌లకు పెట్టుబడులు రానున్నాయన్నారు. అలాగే మామిడి, టమోటా, పాల ఉత్పత్తులు, గ్రానైట్ పరిశ్రమలకు వేగవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన సరుకు రవాణా సౌకర్యం కలుగుతుందన్నారు. అలాగే తిరుపతికి వచ్చే లక్షలాది ప్రయాణీకులకు చిత్తూరు మీదుగా ప్రయాణం సులభం అవుతుందన్నారు.

## గణేష్ ఉత్సవాలకు సహకారం

పెనుమూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:

మండల పరిధిలో వినాయకచవితి పురస్కరించుకుని నిర్వహించే గణేష్ ఉత్సవాలకు నిర్వాహకులు శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులకు సహకారం అందించాలని ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వినాయక విగ్రహాలు ప్రతిష్టించి ఉత్సవాలు నిర్వహించే వారు సింగిల్‌విండో విధానం ద్వారా అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. ఉత్సవాలు పురస్కరించుకుని ఎక్కడా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా ఏర్పాట్లు చేసుకోవాలని, అలాగే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే విగ్రహ ప్రతిష్ట, ఊరేగింపు సమయాల్లో నిర్వాహకులు సంయమనం పాటించాలని, పోలీసు శాఖ సూచించి నిబంధనలు, మార్గదర్శకాలు తప్పక పాటించాలన్నారు. ఎక్కడ ఎలాంటి ఘర్షణలు, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తాము ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటామన్నారు.

## బాలికల సంరక్షణపై షార్ట్ ఫిల్మ్ పోటీలు

– డిఎంహెచ్‌ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి



**చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**

అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. స్టాప్ సెక్స్ సెలెక్షన్ సేవ్ ది గర్ల్ చైల్డ్ అనే అంశంపై సిపిపిఎన్‌డిటి చట్టంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, జిల్లాలోని 8 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తి వున్న విద్యార్థులు బాలికల సంరక్షణ ఇతివృత్తంతో పది నిమిషాల నిడివి గల షార్ట్ ఫిల్మ్ రూపొందించి సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ ద్వారా డిఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపాలన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.20, రూ.10 వేలు అందజేస్తామన్నారు. విజేతలకు మెమెంటో, ప్రశంసాపత్రాలను అంతర్జాతీయ బాలికల దినోత్సవం అక్టోబర్ 11వ తేదీన కలెక్టర్ చేతుల మీదుగా అందించడం జరుగుతుందన్నారు.

## గణనాధుడి సన్నిధిలో జగ్గంపేట ఎమ్మెల్యే

కాణిపాకం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:



జగ్గంపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఎఇఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజు గోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామి వారి సేవలో పాల్గొన్నారు. అలాగే శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు వేద మండపంలో ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఇదిలా వుండగా కాణిపాకం దేవస్థానంలో జరుగనున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆహ్వానపత్రికను జ్యోతుల నెహ్రూకు ఎఇఓ రవీంద్రబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## తోతాపురి మామిడిలో తలమార్పిడిపై శిక్షణ

**తవణంపల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** తోతాపురి మామిడిలో తల మార్పిడి కార్యక్రమంపై గురువారం మండలంలోని రైతులకు జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని మామిడి రైతులకు కామాలూరు గ్రామ సమీపంలోని సిద్ధార్థ మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీలో తోతాపురి మామిడి రకంలో తల మార్పిడిపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తోతాపురి మామిడి పంటకు సరైన గిట్టుబాటు ధర లేని నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ కార్యక్రమంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన అధికారి సతీష్ మాట్లాడుతూ తోతాపురి మామిడి పంటలో తల మార్పిడి ద్వారా వివిధ రకాల మామిడి పంట అంటుకట్టడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చునన్నారు. ఈ మేరకు అంటు కట్టే విధానంను కామాలూరు సమీపంలోని పూర్ణచంద్రారెడ్డి, చంద్రబాబుల పొలంలో క్షేత్ర స్థాయి అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్నోకు చెందిన యుఎస్‌ఐఆర్ శాస్త్రవేత్తలు హెచ్‌ఎస్ సింగ్, అబా సింగ్, డాక్టర్ రవి, ఉద్యానశాఖ ఎడి కోటేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, బంగారుపాళ్యం ఉద్యాన అధికారి సాగరిక, మండలంలోని మామిడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు దంపతుల పేరిట విశేష పూజలు

రామకుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



సీఎం చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరి దంపతుల పేరిట కూటమి నేతలు విశేష పూజలు చేయించారు. గురువారం మండలంలోని ఆనిగనూరు గ్రామంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో సీఎం దంపతుల 45వ వివాహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక అర్చనలు అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పికెయం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, రాష్ట్ర గ్రంథాలయ డైరెక్టర్ మునస్వామి, మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, నేతలు కామరాజు నాయక్, రామ్మూర్తి, గుర్రప్ప, కన్నన్, విశ్వనాథ్, రఫీ, శంకరాచలం, జైయి, కృష్ణారెడ్డి, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమీషనర్‌చే పోలింగ్ కేంద్రాల పరిశీలన

కుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో కుప్పం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 32 వార్డుల్లోని 64 పోలింగ్ కేంద్రాలను గురువారం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈసందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో తాగు నీరు, విద్యుత్ వసతి, పారిశుధ్యం, ఫర్నీచర్, మరుగుదొడ్లు, ర్యాంప్ తదితర మౌలిక వసతులను పరిశీలించారు. పోలి ంగ్ రోజున ఓటర్లు సులభంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి సజావుగా జరిగేలా సిబ్బంది సహకరించాలన్నారు. ఈసందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు ,స్వర్ణవార్డు సచివాలయాల్లో ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉంచామన్నారు. ఏదేని అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా 11వతేది సాయంత్రం 5గంటల లోపల మున్సిపల్ కార్యాలయంలో అందించాలని కోరారు.

## రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ప్రారంభం

కుప్పం, సెప్టె ంబర్ 10 ప్రభాతవార్త



కుప్పం రెస్కో డైరెక్టర్ ఆర్ముగం స్వగృహంపై రెండు కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్‌ను గురువారం ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ సభ్యుడు రాజ్‌కుమార్, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, రెస్కో ఎండి సోమశేఖర్. మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ ప్రారంభించారు. ఈసందర్భంగా రెస్కో ఛైర్మన్ మాట్లాడుతూ ఇదివరకే ప్రభుత్వం పిఎం సూర్యఘర్ కింద ఎస్సీ,ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా రూఫ్‌టాప్ సోలార్ అందించిందన్నారు. మరో 37వేలమంది బిసిలకు సైతం రూఫ్‌టాప్ సోలార్లు ఏర్పాటుచేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కార్పొరేషన్ డైరెక్టర్లు వేణుగోపాల్, తిరుమగళ్, రెస్కో డైరెక్టర్లు శివ, మురళి, హారోగరన్, బసవరాజు,చలపతి, నేతలు జయరాంనాయుడు,అప్పు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ టెక్నాలజీపై కెఇసి..అట్రిసోల్ సంస్థతో ఎంఒయు

కుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీ అభివృద్ధి చేసే అంశంగా కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ బెంగళూరుకు చెందిన అట్రిసోల్ సంస్థ మధ్యం అవగాహన ఒప్పందం (ఎంఒయు) చేసుకున్నారు. ఈ ఎంఒయులో భాగంగా కెఇసిలో స్టార్టప్ సెంటర్, డ్రోన్ టెక్నాలజీకి చెందిన ఆవిష్కరణ, పరిశోధన, స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవస్థ, డ్రోన్ ల్యాబ్‌ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులకు డ్రోన్ తయారీ, మరమ్మత్తులు, నిర్వహణ, సెన్సర్లు, రోబోటిక్స్, త్రిమితీయ ముద్రణ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. కార్యక్రమంలో కాలేజ్ ఛైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్, అట్రిసోల్ సిఇఒ ఆంధ్ర రాహుల్ చౌదరి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌బాబు, హెచ్‌ఓడి డాక్టర్ కోదండరామయ్య, అధ్యాపకులు, ఇట్రిసోల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేయాలి

– ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



కుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేసేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం సూచించారు. గురువారం కంగుందిలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా అమలు చేస్తున్నారన్నారు. కుప్పానికి పరిశ్రమలు, కృష్ణాజలాలు తెచ్చారన్నారు. వీటికితోడు గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలు కూడా తమకు మేలు చేస్తున్న సిఎం చంద్రబాబును మరింత ఆదరించాలని కోరారు. కుప్పం మండలంలో అన్ని పంచాయతీలు, ఎంపిటిసి స్థానాలు గెలవాలన్నారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి ధనశేఖర్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, కడ సభ్యుడు రామచంద్ర, కార్పొరేషన్ డైరెక్టర్లు శరవణ, మణి,క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, యూనిట్ ఇన్‌చార్జ్ దివాకర్, పిఎసిఎస్ ఛైర్మన్ కృష్ణమూర్తి, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు

కుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

ఇందూ జ్ఞాన వేదిక కుప్పం కమిటీ అధ్వర్యంలో స్థానిక జమీందారు బంగ్లా వద్ద కృష్ణాష్టమి సందర్భంగా ప్రతిష్టించిన శ్రీకృష్ణుడి విగ్రహాన్ని గురువారం పట్టణంలో ఘన ంగా ఊరేగించారు. మండపం వద్ద నిత్యం పూజలు, భగవద్గీత పారాయణం చేశారు. కార్యక్రమంలో రెస్కో ఛైర్మన్ ప్రతాప్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, మాజీ ఎంపిపి డాక్టర్ వెంకటేష్, రెస్కో డైరెక్టర్ శివ, ఇందూజ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు కృష్ణ, సభ్యులు కృష్ణారెడ్డి, ప్రకాష్, శరవణ, దేవరాజు తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ సేవలు మరువలేనివి

కుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం పోరాడిన వీర మహిళ చాకలి ఐలమ్మ సేవలు మరువలేనివని రజక సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం స్థానిక బైరుగానిపల్లి దోభీఘాట్ వద్ద చాకలి ఐలమ్మ వర్థంతి సందర్భంగా ఆమె చిత్రపటం ఏర్పాటుచేసి పూజలు చేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కన్నన్, రంగనాథ్, నరసింహులు, దయాకర్, గోవిందరాజులు, వెంకటేష్, శేఖర్, రాజప్ప, వెంకటాచలం, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## పెన్షనర్లచే థ్యాంక్యూ సిఎం సార్ కార్యక్రమం

కుప్పం, సెప్టెంబర్ 10ప్రభాతవార్త




స్థానిక ఎన్జీఒ భవనంలో పెన్షనర్ల సంఘం అధ్వర్యంలో థ్యాంక్యూ సిఎం సార్ కార్యక్రమంను చేపటారు. సంఘ అధ్యక్షుడు పిజి సెల్వం, ప్రధాన కార్యదర్శి గణేష్ పిళ్లైల అధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు పిఆర్‌సి కమీషన్ పట్ల స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. అలాగే రెండు డిఆర్ బకాయిలు విడుదల చేయడంతో పాటు పెన్షనర్లకు మూడు శాతం అడిషనల్ క్వాంటం పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం త్వరగా ఐఆర్ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో పెన్షనర్లు విజయకుమార్, రఘునాథం, నందగోపాల్, రామచంద్రన్, మునెప్ప, సుబ్రమణ్యంనాయుడు, ఖలీల్‌సాహెబ్, వెంకటేశు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

కడ సభ్యుడు రాజ్ కుమార్




కుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

కుప్పం మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు కడ సభ్యుడు రాజ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మున్సిపాలిటీ పరిధిలోని పాతపేట 23, 24 వరకు ఎస్సీ బీసీలకు సంబంధించిన స్మశాన వాటిక ప్రహారీ గోడ నిర్మాణ కు ఆయన భూమి పూజ చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రెస్కో ఛైర్మన్ ప్రతాప్ ,మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ ,మున్సిపల్‌టిడిపిఅధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్ సోమశేఖర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడమే లక్షయం

రెస్కో ఛైర్మన్ ప్రతాప్ కుమార్

కుప్పం,సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో) పరిధిలో వినియోగదారులకు, రైతు లకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడమే తమ లక్ష్యమని రెస్కో చైర్మన్ ప్రతాప్ కుమార్ పేర్కొన్నారు. గురువారం గుండ్ల సాగరం గ్రామంలో ప్రజల సౌకర్యార్థం నూతన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కుప్పంలో నూతనంగా 10 విద్యుత్ ఉప కేంద్రంల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఏదేని విద్యుత్ సమస్యలు తలెత్తితే 1912 నెంబర్ కు సమాచారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రాజకుమార్ ,జనసేన ఇన్చార్జి నరేష్ ,రెస్కో డైరెక్టర్లు అమీర్, శివ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పిల్లలకు పుస్తకాలు, సామాగ్రి పంపిణీ




కుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

సీఎం చంద్రబాబు నాయుడు వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుప్పం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అంగన్ వాడీ పాఠశాలల్లో టిడిపి నాయకులు విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల మధ్య ఈ కార్యక్రమం నిర్వ హించ దం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, గంగమ్మ గుడి డైరెక్టర్‌జయరామ్‌నాయుడు,బూత్‌ఇన్‌చార్జ్‌లోకేష్ బాబు ,శ్రీకాంత్ ,లోకనాథం, కరుణ ,రాజు పాల్గొన్నారు

## గ్రామాల అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

పీకేయం యుడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు

రామకుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



గ్రామాల అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని పీకే ఎం యుడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు పేర్కొన్నారు .గురువారం మండల పరిధిలోని 50 గ్రామాల్లో 1. 50 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేయనున్న 50 హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు బల్ల గ్రామంలో భూమిపూజ చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. అవసరమైన చోట్ల రోడ్లు, డ్రైనేజీలు ,వీధి దీపాలు, తాగునీటి వసతి ఇతర మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంతో నాయకులు మునస్వామి, వెంకటరమణ, ఆనందరెడ్డి, పత్రనారాయణ, విశ్వనాథ్, గుర్రప్ప, నాగభూషణం, రఫీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఆర్‌కే కళాశాలో కోలాహలంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు

చిత్తూరురూరల్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణం, రుక్మిణి క్రిష్ణస్వామి విద్యాలయ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే కార్యక్రమంను కోలాహలంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఎస్పీ ఆర్ రాజశేఖర్‌బాబు (నాన్‌కేడర్)మాట్లాడుతూవిద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకొని అపజ యాలకు భయపడకుండా కష్టపడి చదివితే ఒకరోజు మీకళలు నిజమవుతాయన్నారు. అలాగే మరో విశిష్ట అతిధి అపోలో ఆసుపత్రి జనరల్ సర్జన్ డా. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ నేను ఇదే కళాశాలలో ఇంటర్ బైపిసి కష్టపడి చదివి డాక్టరుగా మీముందుకు వచ్చానని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించిన ఉత్తమ విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసపత్రాలను అతిధుల చేతుల మీదుగా అందజేసారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఫ్రెషర్స్‌డే ఆనందోత్సవాలతో ముగిసింది, కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## నైనానందం నేత్ర గణిత అవధానం

చిత్తూరురూరల్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణం, బిఎస్ కన్నన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వ ర్యంలో కన్నన్ 99వ జయంతి సందర్భంగా గణిత నేత్రావదానం నిర్వహించారు. తుమ్మిందపాళ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చాముండి, జ్ఞానప్రి య, శర్వాన్‌లు కనుబొమ్మల కదలికలతో గణితానికి సంబంధించిన గణాలు వర్గాలు, ఘన మూలం వర్గమాఊలం, వింద చరాలు,ఆంగ్లపదాలు, ఆంగ్ల వ్యాఖ్యలను ప్రేక్షకులు ఒక కాగితంపై రాసి ఇవ్వగా సమాధానాలు ఇచ్చి అందరినీ అబ్బురపరిచారు. నేత్రావధానం, గణితావదాలు రెండింటిని కలిసి నేత్ర అవధానంగా చేయడం మా విద్యార్థుల ప్రత్యేకత అని సంధానకర్త అరుణశివప్రసాద్ పేర్కొన్నారు. గణితం అంటే కేవలం లెక్కలు మాత్రమే కాదు అది ఒక మానసిక వ్యాయామని, పిల్లల ప్రతిభ అమోఘమని కన్నన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోమల తెలిపారు. కార్యక్రమంలో సైన్స్‌సెంటర్ కోఆర్డినేటర్ జయంతి, పూర్వవిద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి మునిరత్నం, మురళి, నరసింహులునాయులు, రవికుమార్, కుమారస్వామి, లైన్స్‌క్లబ్ గోల్డ్ జోనల్ చైర్మెన్ ఎంవి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తులచే సాయిలింగేశ్వరునికి పాలాభిషేకం

చిత్తూరురూరల్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణం,గిరింపేటలోని సత్య సాయి సేవాసదన్ నందు ఉదయం సాయిలింగేశ్వరునికి వివిధ పుష్ప పరిమళ ద్రవ్యాలు, చెరుకు రసం, కొబ్బరినీళ్లు, గంధం, పన్నీ రు. పసుపు, బిల్వపాలఉు తదితర వాటిచే నమకం, చమకం సామూహిక పఠనం చేస్తూ భక్తులచే స్వయంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం శివా అష్టోత్తరం, శివభజన, మహా మంగళ హారతి, ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు ఎన్ మధుసూదనం, అధిక సంఖ్యలో మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## కళాశాల ఆవరణలో శ్రమదానం.. మొక్కల పెంపకానికి శ్రీకారం

తిరుపతి విద్య సెప్టెంబర్ 10 ప్రభాత వార్త



ఎస్.వి. వ్యవసాయ కళాశాలలోని జన్యుశాస్త్రం, మొక్కల ప్రజనన విభాగం పాలీహౌస్ పరిసరాల్లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎస్. హేమలత కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె సూచించారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పాలీహౌస్ పరిసరాలను శుభ్రం చేసి, వ్యర్థాలను తొలగించారు. అనంతరం కుండీల్లో మొక్కలు నాటేందుకు అవసరమైన మట్టి మిశ్రమాన్ని నింపి, మొక్కల పెంపకానికి అనువైన ప్రాంతాన్ని సిద్ధం చేశారు. స్వచ్ఛమైన, పచ్చదనంతో కూడిన వాతావరణం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రం, జన్యుశాస్త్రం-మొక్కల ప్రజనన, వ్యవసాయ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థులతో పాటు బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ మూడో సంవత్సరం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రమదానంలో భాగంగా విద్యార్థులు స్వయంగా పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు మొక్కల పెంపకానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అధ్యాపకులు పేర్కొన్నారు. కళాశాల ఆవరణను పరిశుభ్రంగా, పచ్చగా ఉంచడం ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత మరింత పెంపొందుతాయని తెలిపారు.కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పి. శాంతి, డాక్టర్ కె. నవ్యజ్యోతి, జన్యుశాస్త్రం, మొక్కల ప్రజనన విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం. సుధారాణి, డాక్టర్ ఎం. శ్రీవల్లి దేవి, డాక్టర్ బి. సంతోష్‌కుమార్ నాయక్ మార్గదర్శకత్వంలో నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకుల చురుకైన భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## కరాటేలో విశ్వసాయి విద్యార్థికి డబుల్ గోల్డ్

### జాతీయ స్థాయి పోటీల్లో జస్వంత్‌రెడ్డి ప్రతిభ

తిరుపతి విద్య సెప్టెంబర్ 10 ప్రభాత వార్త



చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తున్న విశ్వసాయి విద్యాసంస్థల విద్యార్థి జాతీయ స్థాయిలో సత్తా చాటాడు. సీనియర్ ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూపులో చదువుతున్న ఐ. జస్వంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించిన ఆల్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్‌లో పాల్గొని రెండు విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించాడు.ఎనిమిది రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించడం అభినందనీయమని విశ్వసాయి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. సత్యనారాయణ అన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సాహం అందిస్తున్నామని, తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచడం సంస్థకు గర్వకారణమని తెలిపారు.విద్యాసంస్థల వైస్ చైర్మన్ కృష్ణమోహన్, డైరెక్టర్ శివ సంకేత్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. చదువులో రాణించడంతోపాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ విద్యార్థులు ప్రతిభ చాటుకునేలా అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని తెలిపారు. జస్వంత్‌రెడ్డి రెండు స్వర్ణ పతకాలు సాధించడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, జస్వంత్‌రెడ్డి విజయం తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విద్యాసంస్థలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యార్థి విజయంపై విశ్వసాయి జూనియర్ కళాశాలప్రిన్సిపాల్,అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేసి జస్వంత్‌రెడ్డిని అభినందించారు.

## ప్రజా సేవలో మరిన్ని విజయాలు

### -ఎంపి చిన్నికి సన్మానం



తిరుపతి,సెప్టెంబర్ 10ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో సంపూర్ణ ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు కలిగి, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని టిడిపి నేతలు ఆకాంక్షించారు. తిరుపతికి విచ్చేసిన టిడిపి విజయవాడ ఎంపీ కశినేని శివనాథ్ (చిన్ని )కుటుంబంకు టిడిపి నేతలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఆర్.సి. మునికృష్ణ, నరసింహచారి, ఆర్.పి. శ్రీనివాసులు, క్రికెట్ విజయ్, ఆముదాల తులసి, దూది శివ, తిరుత్తని వేణుగోపాల్, నరేంద్ర, శీను తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## గోవిందుని కృపతో కైలాసధామంకు నగదు వితరణ

### మామండూరు గ్రామస్థుడు గోవింద రెడ్డి



చంద్రగిరి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: గోవిందుని కృపతో తమకు కలిగినంతలో కైలాసధామం నిర్మాణం కోసం గురువారం రూ.5 లక్షలు విరాళంగా అందజేస్తున్నట్లు మామండూరుకు చెందిన గోవింద రెడ్డి తెలిపారు. చంద్రగిరి సమీపంలోని స్వర్ణముఖీ నదీతీరాన కైలాస ధామం ఆధునిక హంగులతో నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో కైలాసధామం కమిటీ దాతల సహకారం కోరగా, నరశింగాపురంకు చెందిన వెంకటముని రెడ్డి ప్రత్యేక చొరవతో గోవింద రెడ్డి తనవంతు సహకారం అందించడానికి ముందుకు వచ్చారు. ఈ క్రమంలో గోవింద రెడ్డి తన భార్య దివంగత డాక్టర్ ఎం.శ్రీదేవి రెడ్డి జ్ఞాపకార్థం రూ.5 లక్షలు నగదు రూపేనా కైలాసధామం కమిటీ అధ్యక్షుడు వీరంగారి రమేష్ రెడ్డి, కార్యదర్శి నాగరాజ నాయుడు, కోశాధికారి ఓంకార్ భరత్ రాజ్, సభ్యులు ఏఎంసి కమిటీ చైర్మన్ గౌస్‌భాషాకు అందజేశారు. కైలాసధామం నిర్మాణంలో తనవంతు దాతృత్వం చూపిన గోవిందరెడ్డికి, సహకరించిన వెంకటముని రెడ్డికి ఎంఎల్ఏ పులివర్తి నాని, కైలాసధామం కమిటీ కృతజ్ఞతలు తెలిపారు.టిడిపి చంద్రగిరి పట్టణ అధ్యక్షుడు సక్కూరు ధనంజయ రెడ్డి, నాయకులు చెంచయ్య నాయుడు, ఉగ్రాణం గురునాథం రెడ్డి, శంకర్ రెడ్డి, కైలాసధామం నిర్మాణ ప్రక్రియలో తనవంతు దాతృత్వాన్ని చూపడంతో పాటు నిర్మాణ బాధ్యతలను సైతం చేపట్టిన ఇంజినీర్ రాజులగారి మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలపై విద్యార్థులకు అవగాహనా సదస్సు

### ఏఓ విజయభాస్కర్



చంద్రగిరి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: క్షేత్ర స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం నుండి రైతులకు లభిస్తున్నట్లు వ్యవసాయ సమాచారంపై గురువారం కొటాలలో మోహన్‌బాబు యూని వర్సిటీ, మండల వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించినట్లు ఏఓ విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ఎంబియు, స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు చెందిన బి.ఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్ ఫైనల్ ఇయ్యర్ పుల్లయ్యగారి పల్లి, కోనంగివారిపల్లి, కొటాల విద్యార్థులతో కొటాలలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంటల సాగు, వాతావరణ ప్రభావాలు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా డీన్ డాక్టర్ చంద్రకాంత్ శర్మ, అధ్యాపకులతో, రైతులతో చర్చించి శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలోని సమస్యలపై విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సభ్యులు డాక్టర్ పి.మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ ఏ.నిఖిత, డాక్టర్ పి.శ్రావణి, డి.రామ్మోహన్, డాక్టర్ జి.నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్స్ డైరెక్టర్‌ను కలిసిన బిజేపి నాయకులు

### శివ రాయల్



తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త స్విమ్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జగదీష్‌ని బీజేపీ నాయకులు శివ రాయల్ కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. గురువారం స్విమ్స్ డైరెక్టర్ చాంబర్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కండువా

## వైఎస్ఆర్ సిపి కుటుంబ సభ్యులను పరామర్శించిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



రామచంద్రాపురం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: వైఎస్ఆర్ సిపి కుటుంబ సభ్యులను విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పరామర్శించారు. అనుప్పల్లి పంచాయతీలో ఇటీవల మృతి చెందిన గంగిరెడ్డి, ధనలక్ష్మి, పివి పురం గ్రామంలో మునికృష్ణారెడ్డి దశదిన కర్మక్రియలకుఆయన హాజరయ్యారు. మృతుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా వుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ఎద్దల చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి నాయకులు చిరంజీవి నాయుడు, రాజశేఖర్ రెడ్డి, శంకర్ రెడ్డి, దిలీప్ రెడ్డి, సిద్దారెడ్డి, భాస్కర్ రాయల్, కేశవ రెడ్డి, దామోదర్ రెడ్డి, పాండు రెడ్డి, హరినాథ్ రెడ్డి, గురవారెడ్డి, శివారెడ్డి, తదితరులు తెలిపారు.

## ప్రదర్శన ద్వారా ఈవెంట్ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు

తిరుపతి,సెప్టెంబర్ 10ప్రభాతవార్త:



పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఎక్స్‌టర్నల్ ఎలెక్టివ్‌గా ఈవెంట్ మేనేజ్‌మెంట్ కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థులు తమ ప్రాక్టికల్‌లో భాగంగా గురువారం ఒక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రెయిన్ గేమ్స్, వినోదాత్మక ఆటలు, హ్యాండ్‌మేడ్ వస్తువులు, ఫోటో బూత్, మెహందీ, ఫుడ్ స్టాల్ వంటి వివిధ ఆకర్షణీయ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న ఈవెంట్ మేనేజ్‌మెంట్ అంశాలను ఆచరణాత్మకంగా అమలు చేసే అవకాశం పొందారు. మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సోషల్ వర్క్, సైకాలజీ తదితర విభాగాలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమం నిర్వహణలో పాల్గొన్నారు. ప్రతి కార్యక్రమానికి ప్రత్యేకంగా సమన్వయకర్తలు విద్యార్థి బృందాలను ఏర్పాటు చేసి, ప్రణాళిక, సమన్వయం, బృందపని, కమ్యూనికేషన్, సమయ నిర్వహణ, స్టాల్ నిర్వహణ, ప్రేక్షకులతో అనుసంధానం వంటి నైపుణ్యాలను విద్యార్థులు ఆచరణాత్మకంగా అభ్యసించారు. సాయి కృష్ణ మోహన కొండ్ర, సుహానా సుల్తానా, ప్రసన్న గొంగట్టి ఈ కార్యక్రమానికి మొత్తం సమన్వయకర్తలుగా వ్యవహరించి, వివిధ కార్యక్రమాలకు సంబంధించిన బృందాలను సమన్వయం చేస్తూ మొత్తం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు కలిసి పనిచేయడం ద్వారా నాయకత్వం, సృజనాత్మకత, సంస్థాగత నైపుణ్యాలు, బృంద స్ఫూర్తి వంటి అనేక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం లభించింది.

## మెగా డిఎస్సీపై జగన్ చేస్తున్న ఆరోపణలు నిరాధారం

### -ఏపీపీఎస్సీ అంశంపై సమాధానం చెప్పాలి -రాగల ఆనంద్ గౌడ్



తిరుపతి,సెప్టెంబర్ 10ప్రభాతవార్త: యువతను తప్పుదోవ పట్టించే రాజకీయాలు మానుకోవాలని, మెగా డీఎస్సీ విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు నిరాధారమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్ గౌడ్ అన్నారు. ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ,సంబంధిత అధికారులు అనేక సందర్భాల్లో వివరణ ఇచ్చారని చెప్పారు. గత ఐదేళ్ళపాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా నిరుద్యోగ యువతను నిరాశకు గురిచేసిన వైసిపి ఇప్పుడు కూటమి ప్రభుత్వం పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటే అడ్డంకులు సృష్టించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. జగన్‌కు నిజంగా ధైర్యం ఉంటే ఏపీపీఎస్సీ వ్యవహారంపై సమగ్ర వివరణ ఇవ్వాలని ఆనంద్ గౌడ్ డిమాండ్ చేశారు. మెగా డిఎస్సీ ప్రక్రియపై కోర్టుల్లో వైసీపీ నేతలు కేసులు వేస్తూ, అదే సమయంలో కోర్టు పరిధిలో ఉన్న అంశంపై సీబీఐ విచారణ కోరడం రాజకీయ కపటత్వానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. రాబోయే రోజుల్లో మరో డిఎస్సీ నోటిఫికేషన్ కూడా వస్తుందని, నిరుద్యోగ యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. డిజిటల్ మూల్యాంకనంపై కోర్టు అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాత మాన్యువల్ మూల్యాంకనం ఎందుకు చేపట్టారు? మూల్యాంకన ప్రక్రియను ప్రైవేట్ వ్యక్తులకు ఎందుకు అప్పగించారు? డిజిటల్, మాన్యువల్ మూల్యాంకనాల్లో మార్కుల వ్యత్యాసానికి కారణం ఏమిటి? ఓఎంఆర్ షీట్లపై డేటా ఎంట్రీ ఆపరేటర్ల జోక్యం ఎందుకు జరిగింది? ఒరిజినల్ జవాబు పత్రాలను 84 రోజుల పాటు భద్రపరిచిన విధానం ఏమిటి? ఈ అంశాలపై సమగ్రంగా ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఉందని ఆయన అన్నారు. ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా మెగాడిఎస్సీపై రాజకీయ ఆరోపణలుచేయడం ద్వారా నిరుద్యోగ యువతను గందరగోళానికి గురిచేయవద్దని ఆనంద్ గౌడ్ కోరారు..

## బ్రహ్మోత్సవాలో మెరుగైన సేవలు



తిరుపతి,సెప్టెంబర్ 10ప్రభాతవార్త: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆర్టీసి డ్రైవర్లు సిబ్బంది సురక్షిత ప్రయాణ సేవలు అందించాలని ఆర్టీసి తిరుపతి రీజియన్ అధికారులు కోరారు. ముఖ్యంగా గరుడసేవ ఇతర ముఖ్య ఉత్సవాలు, పెరటాసి మాసం రద్దీతో స్పెషల్ బస్సుల నిర్వహణపై సిబ్బందితో డిపిటిఓ కె.శ్రీనివాస్ చర్చించారు. గరుడోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఇందుకు అన్ని అసోసియేషన్ నాయకులు సహకారం పూర్తిగా ఉంటుందని తెలియజేశారు. ఇంకా బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా మెరుగైన సేవ చేసే విధంగా అందరు సిబ్బంది కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమములో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పి.విశ్వనాథ్ ,డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ టి.బాలాజీ ,పర్సనల్ ఆఫీసర్ ఆర్. హరీష్ తిరుపతి ,అలిపిరి డిఎంలు కె.సురేంద్ర కుమార్, ఎస్. హరిబాబు ,అన్ని అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

## ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా ప్రకాశం పార్కును అభివృద్ధి చేయండి.



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 10 ప్రభాత వార్త

### కమిషనర్ ఎం.జయకృష్ణ

వాకర్స్, సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండేలా ప్రకాశం పార్కును అభివృద్ధి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులను ఆదేశించారు. తిరుమల బైపాస్ రోడ్డులో ఉన్న ప్రకాశం పార్క్‌ను కమిషనర్ ఎం.జయకృష్ణ గురువారం పరిశీలిం చారు. పార్క్‌లో వాకర్స్ అసోసియే షన్ సభ్యులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్క్‌లో త్రాగునీటి సదుపాయం కల్పించాలని, కూర్చోవడానికి బెంచీలు తక్కువగా ఉన్నందున మరిన్ని ఏర్పాటు చేయాలని వాకర్స్ కోరారు. అలాగే యోగా చేసుకునేందుకు ప్రత్యేక సదుపాయం కల్పించాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పార్క్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు కమిషనర్ సూచిం చారు. పార్క్ ముందు వాహనాలను ఇష్టానుసారంగా నిలుపుతున్నారని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తెలియజేయగా, సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమిష నర్‌వెంట హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డీఈ రమణ, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, సిబ్బంది ఉన్నారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

### -టిడిపి నేతలతో ఇన్‌ఛార్జి బాలాజీ



తిరుపతి,సెప్టెంబర్ 10ప్రభాతవార్త: తిరుపతి నగరపాలకసంస్థ ఎన్నికల్లోనూ జిల్లాలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి సత్తా చాటాలని తిరుపతి టిడిపి ఎన్నికల పరిశీలకుడు నూకసాని బాలాజీ నిర్దేశం చేశారు. గురూవారం సాయంత్రం ఆయనను తిరుపతి నియోజకవర్గం ఇన్చార్జి జెబీ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసారు.టిడిపి స్థానిక ఎన్నికల జిల్లా పరిశీలకుడుగా నూకసాని బాలాజీ రావడంతో ఆయనతో స్థానిక ఎన్నికల పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ , క్లస్టర్ ఇన్చార్జులు దంపూరి భాస్కర్

## ఒక నెల ఒక గ్రామం 4వ విడత కార్యక్రమం

సత్యవేడు, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:



సత్యవేడు మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఒక నెల ఒకగ్రామం అన్న 4వ విడత కార్యక్రమం గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటేశ్వరులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులకు అర్జీలు ద్వారా తమ సమస్యలను సమర్పించారు. పెన్షన్లు, సర్టిఫికెట్లజారీ, రేషన్ కార్డుల్లో తొలగింపులు, మార్పులు, చేర్పులు తదితర సమస్యలకు సంబంధిత వినతిపత్రాలను అందజేశారు. అధికారులు ఆయా సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో త్రివిక్రమరావు, మండల విద్యాశాఖ అధికారి రవి, ఎండోమెంట్‌శాఖ జేఏ నగేష్‌కుమార్, ఇరిగేషన్ శాఖ జూనియర్ అసిస్టెంట్ తిలక్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు సుధ, త్రివేణి, విలేజ్ సర్వేయర్ గణేష్ చంద్ర, వీఆర్ఏ మౌనిక, తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీపీ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఐలమ్మ వర్ధంతి



రేణిగుంట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: రేణిగుంట తహసిల్దార్ కార్యాలయం సమీపంలోని శ్రీగణేష్ రజక కాలనీలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా గురువారం నిర్వహించారు. దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి, దున్నేవాడికే భూమి దక్కాలనే నినాదంతో ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. మహిళలు ఆమెను ఆదర్శంగా తీసుకుని బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఏపీ రజక ఎస్సీ సాధన రాష్ట్ర కన్వీనర్ అక్కినపల్లి లక్ష్మయ్య, గణేష్ రజక సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం, జగదీష్, గంధం మురళి, గోపాల్, భాస్కర్, రమణమ్మ, సరస్వతి, రమేష్, పుల్లమ్మ, సుమతి, ధనమ్మ, కృష్ణమ్మ, హరితదితరులుపాల్గొని ఐలమ్మకు నివాళులర్పించారు.

## ఆత్మవిశ్వాసమే జీవితం.. ఆత్మహత్య పరిష్కారం కాదు



రేణిగుంట, సెప్టెంబరు 10, ప్రభాతవార్త: జాతీయ పోషణ మాసం-2026, ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా గాజులమండ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, ఆత్మహత్యల నివారణపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు హెల్త్ సూపర్వైజర్ కామరాజు ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. సందర్భంగా కామరాజు మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పాలు, గుడ్లు, పండ్లతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీరు, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, మరుగుదొడ్ల వినియోగం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించాలన్నారు.చదువు, పరీక్షలు, కుటుంబ పరిస్థితుల కారణంగా ఒత్తిడికి గురైనప్పుడు సమస్యలను మనసులో దాచుకోకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన వ్యక్తులకు తెలియజేయాలన్నారు. ఆత్మహత్య సమస్యకూ పరిష్కారం కాదని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిరాశ, ఆందోళన, ఒంటరితనం వంటి సమస్యలు ఎదురైతే కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, వైద్యులు లేదా మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం పొందాలని సూచించారు.మాట్లాడుదాం.. విందాం.. తోడుగా నిలుద్దాం.. జీవితాన్ని కాపాడుకుందాం అనే సందేశంతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, మానసిక ధైర్యాన్ని పెంపొందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది సుభాషిణి, తేజ, చాముండేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

## తిరుపతి మార్కెట్లోకి న్యూ బలెనో

### అదిరిపోయే ఫీచర్లతో కొత్త లుక్.. రూ.6.09 లక్షల ప్రారంభ ధర



తిరుపతి విద్య సెప్టెంబర్ 10 ప్రభాత వార్త మారుతి సుజుకి నూతన బలెనో కారును తిరుపతి సమీపంలోని విష్ణు కార్స్ నెక్స్ షోరూమ్‌లో ఘనంగా ఆవిష్కరించారు. తిరుపతి ఆర్టీఓ కె. మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరై కారును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకింగ్, ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు, కస్టమర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందుతున్న నూతన తరం వాహనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. అభివృద్ధి చెందుతున్న తిరుపతిలో ఆధునిక సౌకర్యాలతో కూడిన వాహనాలకు మంచి ఆదరణ ఉంటుందని తెలిపారు.రూ.6,09,900 ప్రారంభ ధరతో అందుబాటులోకి వచ్చిన న్యూ బలెనోలో అధునాతన భద్రతా సాంకేతికతతో పాటు 360 డిగ్రీల కెమెరా, ఆరు గాలి సంచులు, ముందుభాగంలో గాలి ప్రసరణ సీట్లు, వైర్‌లెస్ ఛార్జింగ్, తొమ్మిది అంగుళాల తెర, తలపై సమాచార ప్రదర్శన, స్వయంచాలక వాతావరణ నియంత్రణ వంటి పలు సౌకర్యాలు ఉన్నాయి. సీఎన్జీ, మాన్యువల్, ఏజీఎస్ గేర్ మార్పిడి సదుపాయాలతోనూ ఈ కారు అందుబాటులోకి వచ్చింది.కార్యక్రమంలో మారుతి సుజుకి ప్రతినిధి సందీప్ వర్మ, విజయ్ కుమార్, విష్ణు కార్స్ జీఎం పి. శ్రీనివాసులు, బ్రాంచ్ మేనేజర్ రాజ్‌కుమార్, శిక్షకుడు యు. హరికృష్ణతో పాటు షోరూమ్ సిబ్బంది, బ్యాంకు, ఫైనాన్స్ ప్రతినిధులు, కస్టమర్లు పాల్గొన్నారు. నూతన బలెనోలోని ప్రత్యేకతలను కస్టమర్లకు వివరించారు. ఈ సందర్భంగా కారు ఆవిష్కరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.

## వైసిపి, టిడిపి 300 ఎకరాలు ఆక్రమించారు





రేణిగుంట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త వైసిపి టిడిపి రేణిగుంట మండలంలో 300 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్లాట్లు వేసుకొని అమ్ముకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మాజీమంత్రి మాట్లాడుతూ అటు వైసిపి ఇటు టిడిపి ప్రజాసంక్షేమాన్ని నిరక్ష్యం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేణిగుంట మండలంలో అన్నసంపల్లి, వెంకటాపురం, తూకివాకం, ఎల్లమండ్యం, వేణుగోపాలపురం, జంగారెడ్డి పల్లె తదితర అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ, డికెటి భూములను ఆక్రమించుకొని ప్లాట్లు వేసుకొని అమ్ముకుంటున్నారని మండిపడ్డారు. ఆ భూముల విలువ దాదాపు 1000 కోట్ల రూపాయల పైనే ఉంటుందని అన్నారు. మన్నవరం ప్రాజెక్టు, దుగ్గరాజపట్నం ఓడరేవుల అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందన్నారు. రేణిగుంట (తిరుపతి) విమానాశ్రయం శ్రీవారి వాహనమైన గరుడ పక్షి ఆకారంలో కాంగ్రెస్ పార్టీ నిర్మించిందని ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విమానాశ్రయాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఎవరైనా శ్రీ వెంకటేశ్వర స్వామి కి సంబంధించిన వాటిపై కన్నేస్తే శాపగ్రస్తులవుతారని హెచ్చరించారు. వందలాది ఎకరాలు ఆక్రమించే ప్రభుత్వానికి నిరుపేద జర్నలిస్టులకు ఐదు సెంట్లు భూమి ఇచ్చేందుకు మనసు రాదని ఎద్దేవా చేశారు.రేణిగుంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విఆర్ రావణన్ పలువురు కాంగ్రెస్ నాయ కులు పాల్గొన్నారు.

## 16న ఎస్వీమ్యూజియం ప్రారంభం



తిరుమల,సెప్టెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి: ఎస్వీ మ్యూజియంను 16వతేదీ సిఎం చంద్రబాబునాయుడు ప్రారంభించను న్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఎస్వీ మ్యూజియాన్ని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఓ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడుతో కలసి ఈఓ ముద్దాడ రవిచంద్ర పరిశీలించారు.

# మున్సిపల్ చైర్మన్ కుర్చీ కోసం కుస్తీలు

**- రిజర్వేషన్ల ఖరారుపై ఉత్కంఠ**



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించడంతో సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. 2012వ సంవత్సరం జనవరి నెలలో సూళ్లూరుపేట మేజర్ పంచాయతీ నుండి మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. అనంతరం జరిగిన ప్రథమ మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎస్సీ మహి ళలకు ఈ మున్సిపాలిటీ కేటాయించడంతో పోటాపోటీగా జరిగిన ఎన్నికల్లో మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని తెలుగుదేశం పార్టీ దక్కించుకుంది. అనంతరం ఈ మున్సిపల్ సీటు ఓసీ జనరల్‌కు ఖరారైంది. దీంతో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో అప్పటి పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ నామమాత్ర పోటీ ఇవ్వగలిగింది. కేవలం 7 వార్డుల్లో మాత్రం పోటీ చేసి ఒక్క వార్డును గెలుపొందింది. 25 వార్డులకు గాను 24 వార్డులు వైసిపి కైవసం చేసుకుని చైర్మన్ పీఠాన్ని సొంతం చేసుకుంది.ఎన్నికల్లో వార్డులకు సంబంధించి ఎక్కువగా ఏకగ్రీవలే జరగడం విశేషం.కాగా ప్రస్తుతం సూళ్ళూరుపేట మున్సిపాలిటీ సంబంధించి రిజర్వేషన్ల ఖరారు కానప్పటికీ చైర్మన్ కుర్చీ కోసం అప్పుడే ప్రధాన పార్టీలు వారు కుస్తీలు చేయడం ప్రారంభించారు.

**- రిజర్వేషన్ల ఖరారుపై ఉత్కంఠ**

రిజర్వేషన్ల ఖరారుపై ప్రధాన పార్టీల్లో ఉత్కంఠ నెలకొని ఉంది.ముందుగా ఎస్సీ మహిళా, అనంతరం ఓసి జనరల్‌గా రిజర్వేషన్లుతో చైర్మన్ సీట్లు గెలుచుకుని ఉన్నారు. ప్రస్తుతం ఈ సీటు రిజర్వేషన్ ప్రక్రియలో ఏ కులానికి కేటాయించ బడుతుందో అని తర్జన భజన పడుతున్నారు. రోజుకొక ప్రచారం పట్టణంలో షికారు చేస్తుంది. బీసీలకు ఖరారు అవుతుందని, తిరిగి ఓసీలకు కేటాయిస్తారని, లేనిపక్షంలో ఎస్సీలకు కేటాయించే అవకాశాలు ఉన్నాయంటూ ముమ్మర ప్రచారం కొనసాగు తుంది. ఇందుకు తగ్గటుగా ప్రధాన పార్టీలు వారు ప్రస్తుత నిర్వహించనున్న ప్రత్యక్ష ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని చైర్మన్ గిరిని రిజర్వేషన్ ప్రకారం ఎవరికి కేటాయించిన తాము దక్కించుకోవాలని ఇప్పటినుంచే వ్యూహాలు పన్నుతున్నారు. ఎప్పటికప్పుడు తమ అనుచరులతో సమాలోచనలు చేయడం వార్డుల వారీగా పరిస్థితిని అంచనా వేసి అందుకు తగ్గట్టుగా ఎటువంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలో అనే అంశాలపై చర్చించు కుంటున్నారు. అలాగే అంగ బలం, అర్థ బలంగల వారిని రంగంలోకి దించాలని ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి తోడు సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో 2024 శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఊహించి నిరీతిలో సుమారుతొమ్మిది వేల పైచిలుకు మెజార్టీ రావడం తెలుగుదేశం పార్టీకి ప్లస్‌గా ఉంది. అలాగే గత ఎన్నికల్లో సాధించిన భారీ మెజార్టీని కొనసాగించి ప్రతిష్ట నిలుపుకోవాలని టిడిపి, మరోవైపు ప్రతిపక్ష వైసిపి ఎలాగైనా పట్టణంలో తమపట్టు సాధించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తుంది. రిజర్వేషన్ల ఖరారుతో ఈ ప్రక్రియలకు తెరపడనున్నది.

# శస్త్రచికిత్సల్లో...సాంకేతిక విప్లవం

**- ఏఐ, రోబోటిక్ విధానాలతో మెరుగైన వైద్య సేవలు**
**- తిరుపతిలో ఘనంగా ఏఎస్ఐ 49వ వార్షిక రాష్ట్ర సదస్సు**



తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: శస్త్రచికిత్స రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విప్లవాత్మక మార్పులకు దారితీస్తోందని వైద్య నిపుణులు పేర్కొన్నారు. ఏఐ, రోబోటిక్ సర్జరీ వంటి అత్యాధునిక విధానాలతో శస్త్రచికిత్సలను మరింత కచ్చితత్వంతో, వేగంగా నిర్వహించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా 49వ వార్షిక రాష్ట్ర సదస్సు తిరుపతిలో గురువారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో సర్జన్లు, వైద్య నిపుణులు హాజరయ్యారు. శస్త్రచికిత్సల్లో వస్తున్న నూతన విధానాలు, ఆధునిక సాంకేతికత, రోబోటిక్ సర్జరీ తదితర అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చిస్తున్నారు.

**- శ్రీవారి పాదాల చెంత నిర్వహించడం గర్వకారణం:**

డాక్టర్ ఎం.హరిబాబు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏఎస్ఐ ఆధ్వర్యంలో 48 సార్లు వార్షిక సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం తొలిసారిగా తిరుపతిలో, శ్రీవారి పాదాల చెంత 49వ వార్షిక సదస్సు నిర్వహించడం ఎంతో గర్వకారణమన్నారు. శస్త్రచికిత్స రంగంలో కాలానుగుణంగా అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. గతంలో సంప్రదాయ పద్ధతుల్లో శస్త్రచికిత్సలు నిర్వహించేవారని, ప్రస్తుతం ఏఐ, రోబోటిక్ టెక్నాలజీ వంటి అత్యాధునిక విధానాలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా శస్త్రచికిత్సలను మరింత కచ్చితత్వంతో, తక్కువ సమయంలో నిర్వహించే అవకాశం ఏర్పడిందన్నారు. తద్వారా రోగులకు మెరుగైన చికిత్స అందించడంతో పాటు కోలుకునే సమయాన్ని కూడా తగ్గించేందుకు వీలవుతుందని తెలిపారు.

**- 15 ఏళ్ల తర్వాత తిరుపతిలో సదస్సు: రమేష్‌రెడ్డి**

డాక్టర్ రమేష్ కాపీరెడ్డి మాట్లాడుతూ 2011 తర్వాత ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో సర్జికల్ కాన్ఫరెన్స్ జరిగిన తర్వాత ఇంతటి స్థాయిలో సదస్సు తిరుపతిలో నిర్వహించడం ఇదే తొలి సారని తెలిపారు. సుమారు 15 ఏళ్ల తర్వాత తిరుపతిలో తిరి। సర్జికల్ కాన్ఫరెన్స్ జరగడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. ఈ సదస్సుకు సుమారు 1,000 మంది డెలిగేట్లు హాజరవుతారని అంచనా వేయగా అనూహ్యంగా 1,500 మంది హాజరయ్యారని తెలిపారు. దీంతో కాన్ఫరెన్స్ మరింత ఘనంగా జరుగు తోందన్నారు. సర్జరీ విభాగంలో ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానం మారుతోందని, కొత్త పద్ధతులు, నూతన సాంకేతికతలు, శస్త్రచికిత్సల్లో పాటించాల్సిన మెలకువలపై వైద్యులు పరస్పరం చర్చించుకోవడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని చెప్పారు. పాత పద్ధతులకు పరిమితం కాకుండా ఆధునిక విధానాలను నేర్చుకుని వాటిని వైద్య సేవల్లో అమలు చేయడం ద్వారా రోగులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. వైద్య రంగంలో వస్తున్న మార్పులు, నూతన సర్జికల్ టెక్నిక్స్‌పై అవగాహన పెంచుకోవడానికి ఇలాంటి సదస్సులు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. భవిష్యత్‌లో తిరుపతిలో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి వైద్య సదస్సులు నిర్వహించాలని ఆకాంక్షించారు. తిరుపతిలో ఈ స్థాయిలో సర్జికల్ కాన్ఫరెన్స్ నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇంకా రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును యువ డాక్టర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎస్ బలరామరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంఏ డాక్టర్ హరిబాబు, ఆర్గనైజింగ్ ట్రెజరరీ డాక్టర్ రమేష్ కాపీరెడ్డి,డాక్టర్ వడ్డి సుధాకర్, డాక్టర్ సి. సుధాకర్ రెడ్డి, డాక్టర్ డి.గోపీకృష్ణ రెడ్డి, డాక్టర్ ఎన్. వి.రమణయ్య, ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీలు డాక్టర్ ఓ.సిద్ధార్థ్, డాక్టర్ సర్వేపల్లి సుధాకర్, డాక్టర్ శ్రీ హరిరావు, డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, డాక్టర్ హేమ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ఒలిపి బాలయ్య మృతి కేసులో...కామిరెడ్డికి రిమాండ్

పెళ్లకూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: వడ్డీపాలెం గ్రామ సమీపంలో చింతాలమ్మ చెరువు పంట కాలువ విషయమై తెలుగుదేశం పార్టీ వైసీపీ పార్టీ నాయకులు మధ్య జరిగిన వివాదం నేపథ్యంలో మరణించిన వలిపి బాలయ్య మృతి కేసులో ముద్దాయిగా ఉన్న వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి కోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలుస్తుంది.

## బాలయ్య అంతిమయాత్రలో తేదేపా నాయకులు





పెళ్లకూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: మండలంలోని వడ్డీపాలెం గ్రామ సమీపంలో పంట కాలవ విషయమై తెలుగుదేశం పార్టీ వైఎస్ఆర్సిపి పార్టీల నాయకులు మధ్య జరిగిన వివాదంలో వడ్డీ పాలెం గ్రామం నివాసి ఒలిపి బాలయ్య మృతి చెందగా గురువారం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పంచనామా అనంతరం వడ్డీ పాలెం గ్రామానికి తీసుకుని వచ్చి అంతక్రియలు నిర్వహించారు. ఈ అంతక్రియల్లో తెలుగుదేశం పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, మండల తెదేపా నాయకులు పాల్గొని బాలయ్య మృతదేహానికి నివాళులర్పించారు. మృతిని కుటుంబ సభ్యులకు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పేరం మధు నాయుడు కుమారుడు పేరం వెంకట తేజ నాయుడు పంపిన ఆర్థిక సహాయాన్ని మండల తెదేపా నాయకులు అందజేశారు. బాలయ్య మృతితో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

## పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: మున్సిపాలిటీకి సంబంధించి పోలింగ్ కేంద్రాల జాబితాను గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట మున్సిపాలిటీకి సంబంధించి 32 వార్డులుగాను 55 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ మొత్తం మీద 35,519 ఓట్లు ఉన్నాయి. ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి సాగుతున్న 646 ఓట్లు తగ్గకుండా ఉండేటట్లు వార్డుల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రాల జాబితా మున్సిపల్ కార్యాలయంతో పాటు, ఆర్డీవో, తహసిల్దార్, సబ్ రిజిస్టర్, సబ్ ట్రెజరీ, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలోనూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రచురించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ కె.చెన్నయ్య తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అద్దంకి సన్మానం



బాలాయపల్లి, సెప్టెంబర్ 10 ప్రభావతవార్త: రాణిపేట వద్ద ఉన్న మోడల్ ప్రైమరీ స్కూల్‌లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అద్దంకి విజయలక్ష్మికి ఘనంగా ఆత్మీయ సన్మానం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈఓలు కొండయ్య నాయుడు, స్వర్ణలత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని అద్దంకి విజయలక్ష్మిని ఘనంగా సన్మానించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోవడం ప్రాంతానికి, విద్యా రంగానికి గర్వకారణమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఉపాధ్యాయురాలిని అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కొండయ్య నాయుడు మాట్లాడుతూ అద్దంకి విజయలక్ష్మికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.విద్యార్థులకు పాఠాలను సులభంగా అర్థమయ్యేలా, ఆప్యాయతతో బోధించడంలో అద్దంకి విజయలక్ష్మి ప్రత్యేక శ్రద్ధ చూపుతారని కొండయ్య నాయుడు తెలిపారు. విద్యాబోధనతో పాటు సమాజ సేవలోనూ అద్దంకి విజయలక్ష్మి ముందుంటారని ఎంఈఓ కొండయ్య నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఏ సుమాలిని, టి వేనమ్మ, గురవయ్య, రేవతి, యంజి అంకయ్య, యాతలూరు స్కూల్ టీచర్, మాజీ కౌన్సిలర్ తంబ సుకన్య, సిహెచ్ సునీత, యెటూరు శ్రీనివాసులు రెడ్డి సమరసత సేవా ఫౌండేషన్ తిరుపతి జిల్లా ధర్మ ప్రచారక్, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆచార్య భరద్వాజ సేవా సంస్థ సేవలు అభినందనీయం



తడ,సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: ఆచార్య భర ద్వాజ సేవా సంస్థ సూళ్లూరుపేట వారి ఆధ్వర్య ంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతుంది అందులో భాగంగా గురువారం తడ మండలం వాటంబేడు ఎస్వి కఆర్ ఎమ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 138 మంది విద్యార్థులకు ఐడి కార్డ్స్ అందజేశారు. అదేవిధంగా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ధనుష్ అనే విద్యార్థి జీవశాస్త్రం ఉపాధ్యాయులైన రమణయ్య పూర్తి సహకారంతో రైతులు పంట పొలాల్లోకి వెళ్ళేటప్పుడు పాముల నుండి విష పురుగుల నుండి రక్షణ కల్పించేందుకు నూతన స్నేక్ బైట్ కనిపెట్టాడు ఆచార్య భరద్వాజ్ సేవా సంస్థ విద్యార్థి ధనుష్ ను అభినందించి2116 రూపాయలు నగదు ప్రోత్సాహం అందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునంద, గ్రామ పెద్దలు ఆచార్య భరద్వాజ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## పెన్షన్ కోసం తిరుమల వాసుల తంటాలు

తిరుమల,సెప్టెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి: కూటమి ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన పెన్షన్ల దరఖాస్తుకు తిరుమల కు సంబంధించి స్థానికులు కొత్త పెన్షన్ల కొరకు దరఖాస్తు చేసుకోవడానికి సమస్యలు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ బిల్లుల రూపంలో సమస్యలను ఎదుర్కొంటున్నారు, స్థానిక జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్ రాయల్, కార్యదర్శి మంజు రాయల్, సంయుక్త కార్యదర్శి వంశీ రాయల్ ఎమ్మెల్యే శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్ళారు. కలెక్టర్‌తో చర్చించి ఈ సమస్యను పరిష్కరించవలసిందిగా వినతి పత్రం సమర్పించారు. శెట్టిపల్లిలో అప్లికేషన్లు దానికి సంబంధించిన డాక్యుమెంట్స్ వెల్ఫేర్ అసిస్టెంట్‌కి సమర్పించాలని తెలిపారు. తిరుమల స్థానికులకు బ్రహ్మోత్సవాల్లలో భాగంగా గరుడ సేవ లో ప్రత్యేక గ్యాలరిని ఏర్పాటు చేసి దర్శన భాగ్యం కల్పించాలని తిరుమలవాసులు కోరారు.

## రాజకీయ పార్టీలకు అతీతంగా

**-వినాయక చవితి కార్యక్రమాలలో భాగస్వామ్యం**



తిరుపతి,సెప్టెంబర్ 10ప్రభాతవార్త: తిరుపతిలోని అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరిని ఆహ్వానించి వినాయక చవితి కార్యక్రమాలలో భాగస్వామ్యం చేయడం చాలా సంతోషదా యకమని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. తిరుపతిలో ఏర్పాటు చేసే మండపాల నిర్వాహకులు కమిటీ సూచనలను, ప్రభుత్వాధికారుల సలహాలను తప్పకుండా పాటించి వీధుల మధ్యలో నగర ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా మండపాలు ఏర్పాటు చేయరాదని సూచించారు.అశ్లీల నృత్యాలు డీజే పాటలు పూర్తిగా నిషేధించి భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కార్యాలయంలో గురువారం ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం,మాజీ మేయర్ డాక్టర్ శిరీష ముఖ్య అతిధులుగా విచ్చేసి మహోత్సవ కమిటీ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు నవీన్ కుమార్ రెడ్డి,గుండాల గోపీనాథరెడ్డి,మాంగాటి గోపాల్ రెడ్డి మల్లికార్జున్, వెంకయ్య,మునిరత్నం, ఎస్వీఎం వెంకటేష్, భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలతో బాటు వినాయక చవితి పండుగ కలిసి రావడంతో సుదూర ప్రాంతాలనుంచి తిరుమలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ అంతరాయం లేకుండా వీధులలో విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండప నిర్వాహకులు సంపూర్ణ సహకారం అందించాలన్నారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మల్లికార్జున్, వెంకయ్య,మునిరత్నం, ఎస్వీఎం వెంకటేష్, కరాటే శీను, హేమ కిరణ్, రఘురాం రెడ్డి, చెన్నం నవీన్, పెరియ స్వామి రామ్ కుమార్, తొండమునాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, మల్లారపు రవిప్రసాద్, వరప్రసాద్, కారణాటం మురళి, మల్ల కుప్పం శేఖర, చంద్ర, వాసు, గోపి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ వేదికపై విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమస్యలు




తిరుపతి విద్య, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: విశ్వవిద్యాలయాల బోధనేతర ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులు, సంక్షేమంపై జాతీయ స్థాయిలో చర్చకు తెరలేచింది. అఖిల భారత విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో 15వ జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఉన్నత విద్య పరిస్థితి ప్రధాన అంశంగా మూడు రోజులపాటు సదస్సు జరగనుంది.దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన బోధనేతర ఉద్యోగుల ప్రతినిధులు సదస్సుకు హాజరై ఉన్నత విద్యారంగంలో నెలకొన్న పరిస్థితులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులు, సంక్షేమం, విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించనున్నారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యాచరణపైనా సదస్సులో నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.ఆంధ్రప్రదేశ్ తరఫున విశ్వవిద్యాలయాల బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎం. తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శి నెల్లూరు సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక అధ్యక్షులు సిరిగిరి రమేష్‌బాబు, సంయుక్త కార్యదర్శి డి. గురు ప్రసాద్, ప్రచార సమన్వయకర్త మనోజ్‌కుమార్ సింగ్ హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల అధ్యక్షులు, కార్యదర్శులు కూడా సదస్సులో పాల్గొన్నారు.ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, ప్రయోజనాల పరిరక్షణకు సంఘం నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.

## కాణిపాకం హుండీల ద్వారా రూ.1.29 కోట్లు ఆదాయం



కాణిపాకం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో హుండీల లెక్కింపు ద్వారా రూ.1.29 కోట్ల ఆదాయం లభించింది. గురువారం స్థానిక ఆస్థాన మండపంలో దేవస్థానం ఛైర్మన్ మణినాయుడు, ఇఓ కె.పెంచల కిషోర్‌ల ఆధ్వర్యంలో హుండీలు, కానుకలను లెక్కించారు. ఈ సందర్భంగా 17 రోజులకు గాను 1,28,89,542 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 26 గ్రాముల బంగారు, 360 గ్రాముల వెండి ఆదాయంగా సమకూరింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 22,235 రూపాయలు, నిత్యఅన్నదానం హుండీ ద్వారా 1,57,866 రూపాయలు ఆదాయంగా వచ్చింది. దీనితో పాటు 1,263 అమెరికన్ డాలర్లు, 20 యుఎఇ దినార్లు, 10 సింగపూర్ డాలర్లు, 90 ఆస్ట్రేలియా డాలర్లు, 60 కెనడా డాలర్లు, 50 ఇంగ్లాండ్ ఫౌండ్లు, 8 మలేషియా రింగిట్స్‌గా ఆదాయంగా వచ్చినట్లు దేవస్థానం ఇఓ పెంచల కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యుటీ ఇఓ సాగర్‌బాబు, దేవాదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమీషనర్ చిట్టేమ్మ, ఎఇఓలు ఎస్వి కృష్ణారెడ్డి, మాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరిటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, దివాకర్‌రెడ్డి, దేవస్థానం సిబ్బంది, సేవకులు, కాణిపాకం యూనియన్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రక్తమోడుతున్న బాధితులను చూసి ...చలించిన ఎమ్మెల్యే

**- క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం**



పాకాల, సెప్టెంబరు 10 ప్రభాతవార్త: ప్రజాప్రతినిధిగా తన బాధ్యతను నిర్వర్తించడమే కాకుండా, ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు మాన వత్వంతో స్పందించిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తీరుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. చిత్తూరు నుంచి తిరుపతి వైపు వస్తున్న ఓ ఆటో కొత్తకోట హైవే బ్రిడ్జి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అదే మార్గంలో వెళ్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రమాదాన్ని గమనించి వెంటనే తన వాహనాన్ని నిలిపి, క్షతగాత్రుల వద్దకు చేరుకున్నారు. రక్తమోడుతూ ఆర్తనాదాలు చేస్తున్న బాధితులను చూసిన ఎమ్మెల్యే నాని ఏమాత్రం ఆలస్యం చేయకుండా సహాయక చర్యలకు స్వయంగా శ్రీకారం చుట్టారు. గాయపడిన వారికి ధైర్యం చెప్పడంతో పాటు, ఇతర వాహనదారుల సహకారంతో క్షతగాత్రులను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించేలా చర్యలు చేపట్టారు. అంతటితో ఆగకుండా వైద్యులతో మాట్లాడి బాధితులకు తక్షణం మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రమాద సమయంలో బాధితులకు అండగా నిలిచి, అత్యవసర పరిస్థితిలో సమయస్ఫూర్తితో వ్యవహరించిన ఎమ్మెల్యే నాని తీరును స్థానికులు, వాహనదారులు అభినందించారు. పదవులు, రాజకీయాలకు అతీతంగా ఆపదలో ఉన్న మనిషికి ముందుగా చేయూత అందించడమే నిజమైన మానవత్వమని ఎమ్మెల్యే పులివర్తి నాని మరోసారి చాటిచెప్పారని పలువురు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు చొరవ చూపినందుకు బాధితులు, వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తీయజేసారు.

## సాయి సుధా హాస్పిటల్ ఆధ్వర్యంలో... ఉచిత వైద్య శిబిరం

**- తుమ్మలగుంటలో ఈనెల 12న నిర్వహణ**

తిరుపతి రూరల్ సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామపంచాయతీ పరిధిలోని నలంద నగర్‌లో ఈ నెల 12వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీ సాయి సుధ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం ప్రకటించింది. శ్రీ సాయి సుధ ఫిజియోథెరపీ కేంద్రం వద్ద, శ్రీ సాయి సుధ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సమీపంలో ఈ శిబిరం ఏర్పాటు చేయనున్నారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి, డైరెక్టర్ డాక్టర్ బద్దెల సుకుమార్ గురువారం వెల్లడిస్తూ, ఈ శిబిరంలో ఎముకలు, కీళ్లు, నరాలకు సంబంధించిన వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించడంతో పాటు కంటి వైద్య సేవలు కూడా అందించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం కొనసాగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి నెల రెండవ శనివారం ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## అరకోణం, రేణిగుంట మధ్య...3వ, 4వ రైల్వే లైన్లకు కేంద్రం ఆమోదం

**- హర్షం వ్యక్తం చేసిన ఎంపీ గురుమూర్తి**




బాలాయపల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: అరక్కోణం, రేణిగుంట మధ్య 77 కిలోమీటర్ల మేర 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంపై ఎంపీ మద్దిల గురుమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఈ కీలక ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు, కేంద్ర రైల్వే శాఖకు ఎంపీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అరక్కోణం, రేణిగుంట రైల్వే మార్గం దక్షిణ భారతదేశంలో అత్యంత కీలకమైన మార్గాల్లో ఒకటని ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు. ఈ మార్గంలో 3వ, 4వ రైల్వే లైన్లు అందుబాటులోకి రావడం వల్ల రైళ్ల రాకపోకల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని, ప్రస్తుతం ఉన్న రద్దీ తగ్గి రైళ్ల నిర్వహణ మరింత సులభతరం అవుతుందని తెలిపారు. రైళ్ల రాకపోకల్లో ఆలస్యాలు తగ్గడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందే అవకాశం ఉంటుందని అన్నారు. తిరుపతి దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం కావడంతో ఈ ప్రాజెక్టుకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఎంపీ తెలిపారు. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో తిరుపతికి వచ్చే భక్తులు, పర్యాటకులు, ప్రయాణికులకు ఈ అదనపు రైల్వే లైన్లు మరింత మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందిస్తాయని చెప్పారు. అలాగే సరకు రవాణా వేగవంతం కావడంతో ఈ ప్రాంతంలో వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాలకు కూడా ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. రైల్వే లైన్లు ఏర్పాటు చేయడం మాత్రమే కాకుండా ప్రయాణీకుల రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు ప్యాసింజరు, లోకల్ ట్రైన్స్ పెంచాలని పేర్కొన్నారు.అదనపు రైల్వే లైన్లతో తిరుపతి, రేణిగుంటతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు రైలు అనుసంధానం మరింత బలోపేతం అవుతుందని, ప్రజల రాకపోకలకు, సరకు రవాణాకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఎంపీ గురుమూర్తి అన్నారు. ఈ ప్రాజెక్టు ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధికి దోహదపడటంతో పాటు ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ ప్రణాళిక లక్ష్యాలకు అనుగుణంగా దేశ రవాణా, సరకు రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. 77 కిలోమీటర్ల 3వ, 4వ రైల్వే లైన్ల ప్రాజెక్టు త్వరితగతిన అమలులోకి వచ్చి తిరుపతి ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు గరిష్ఠ ప్రయోజనం చేకూరాలని ఎంపీ మద్దిల గురుమూర్తి ఆకాంక్షించారు.

## పోషకాహార మాసోత్సవం

**పులిచర్ల, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త**



పులిచర్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పులి చర్ల మండలంలోని కావేటి గారి పల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవంలో భాగంగా గురువారం పోషకాహార ప్రదర్శ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పులిచర్ల సిడిపిఓ వాణిశ్రీదేవి మాట్లాడుతూ పోషకాహార మాసొత్స వాలు సెప్టెంబర్ 9వ తేదీ నుండి అక్టోబర్ 8వ తేదీ వరకు జరుగుతాయని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో కూడా అంగన్వాడీ పరిధిలో గల ప్రజలందరికీ కూడా పౌష్టికాహారం పై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలియజేశారు. అందరూ కూడా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని తెలియజేశారు. తగినంత ప్రోటీన్ గల ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలి అలాగే ఆకుకూరలు కూరగాయలు కూడా ప్రతిరోజు మనం తీసుకోవాలని అన్నారు. సరైన ఆహారం తీసుకోకపోతే అనారోగ్యానికి గురి అవుతామని తెలియజేశారు ఆహారంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అలాగే వ్యక్తిగత పరిశుభ్రతను కూడా పాటించాలన్నారు. పసుపుపచ్చని ఆహార పదార్థాలన్నీ కూడా ఎక్కువగా తీసుకోవాలని పేర్కొన్నారు. తెల్లటి ఆహార పదార్థాలన్నీ కూడా తగు మోతాదులో తీసుకోవాలని తెలియజేశారు ముఖ్యంగా ఉప్పు చక్కెర ఆయిల్ అనేటివి తగిన మోతాదు లో తీసుకోవాలి ఎక్కువ మోతాదులో తీసుకోకూడదని అన్నారు. అలాగే పిల్లలు కూడా జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని ఇంటిలో తయారుచేసిన పౌష్టికాహారాన్ని మాత్రమే పిల్లలకు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయలక్ష్మి, సుహాసిని, ఏఎన్ఎం శోభావతి, ఆశా వర్కర్ ధనలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పుత్తూరులో వీహెచ్‌పీ వారిచే శ్రీవారి గొడుగులు యాత్ర

**పుత్తూరురూరల్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:**

పుత్తూరులో శ్రీ వెంకటేశ్వర స్వామివారి గొడుగులు యాత్ర 12వ తేదీ శనివారం పుత్తూరు పురవీధుల్లో భజన భక్తి గీతాలతో వైభవంగా విశ్వహిందూపరిషత్‌వారిచే 12వ సంవత్సరం కార్యక్రమం నిర్వహించబడుతుందని వారు తెలిపారు. ఉదయం 8 గంటలకు కన్యపూజ, ఎవారి పాదుకల పూజ, స్వామి శివానంద కృష్ణ చైతన్యనందస్వామివారిచే ప్రారంభించబడుతుందన్నారు. ఆర్‌డీఎం గేటు నుంచి ఆర్టీసీ బస్టాండ్, అంబేద్కర్ సర్కిల్, కార్వేటినగరం రోడ్డు, కాపు వీధి, బజారువీధి, శివాలయం మీదుగా సుబ్రహ్మణ్యస్వామి గుడి వరకు గొడుగుల ఊరేగింపు జరుగుతుందని, కావున పుత్తూరు పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని కర్పూర హారతితో మొక్కులు తీర్చుకోవాలని తమిళనాడు విశ్వ హిందూ పరిషత్ నాయకులు రామలింగం, తంగేవేలు, ఆర్ఎస్ఎస్‌నాయకులు సుందరమూర్తి వారు కోరారు.

## మెదడులో అకస్మాత్తుగా జరిగే రక్తస్రావాన్ని సకాలంలో గుర్తించడం అత్యంత కీలకం

**– న్యూరో సర్జరీ విభాగం ఆధ్వర్యంలో 7వ ఎండోమెంట్ ఓరేషన్**
**– స్విమ్స్‌ను అత్యాధునిక న్యూరోసర్జరీ వైద్య కేంద్రంగా మరింత బలోపేతం చేస్తున్నాం**
**– స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్**

**తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త**

న్యూరో సర్జరీ విభాగం ఆధ్వర్యంలో 7వ ఎండోమెంట్ ఓరేషన్ ముఖ్య అతిథిగా డాక్టర్. ఆశిస్ పాఠక్, డాక్టర్. శిల్పా కడియాల, డాక్టర్.రామ్, డాక్టర్.ఉమామహేశ్వర రావు, డాక్టర్.బి. సి.యం.ప్రసాద్, డాక్టర్.రమేశ్ చంద్ర పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమం ప్రారంభించారు. తిరుపతి స్విమ్స్‌లో న్యూరోసర్జరీ విభాగం ఆధ్వర్యంలో 7వ శ్రీనివాస్ న్యూరోసర్జరీ ఎండోమెంట్ ఒరేషన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోర్టిస్ హాస్పిటల్, మొహాలీ డైరెక్టర్ ఆఫ్ న్యూరోసర్జరీ డా. ఆశిష్ పాఠక్ మైస్ట్రీ ఆఫ్ స్పాంటేనియన్ సబ్బానైడ్ హెమోరేజ్ అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం అందించారు. స్విమ్స్‌లో అత్యున్నత వైద్య పరిజ్ఞానం అందుబాటులో ఉండాలి అత్యాధునిక చికిత్స సామాన్య ప్రజలకు చేరాలి అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని డా. గుడారు జగదీష్ తెలిపారు. ఇలాంటి ప్రతిష్టాత్మక వైద్య కార్యక్రమాలు స్విమ్స్ న్యూరోసర్జరీ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, వైద్య విద్య, పరిశోధన మరియు రోగుల అత్యాధునిక చికిత్సకు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. డా. డాక్టర్ ఆశిష్ పాఠక్ మాట్లాడుతూ అత్యంత తీవ్రమైన న్యూరోసర్జికల్ అత్యవసర పరిస్థితుల్లో ఒకటని తెలిపారు. అకస్మాత్తుగా వచ్చే తీవ్రమైన తలనొప్పి, వాంతులు, స్పృహలో మార్పులు, మెడ బిగుసుకుపోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ న్యూరో సర్జరీ విభాగం వైద్యులు స్విమ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా

**పుల్లంపేట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :**



పుల్లంపేట మండలంలోని వత్తలూరు, పెద్దూరు, తిప్పాయిపల్లి, గ్రామాల్లో గురువారం తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాలతో ఆయా గ్రామాల పరిధిలోని గ్రామ శివారులో డ్రోన్ కెమెరా ఎగురవేసి నిఘా ఉంచారు, అనుమానాస్పద ప్రదేశాలపై విస్తృతంగా నిఘా ఏర్పాట్లను చేశారు ముఖ్యంగా మండల వ్యాప్తంగా అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపెందుకు, పేకాట స్థావరాలు, కోళ్ల పందేలు, నిర్వహించే ప్రదేశాలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి స్థావరాలపై డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాట్లను పుల్లంపేట పోలీసులు చేపట్టారు, ఎవరైనా అసంఘిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు అయితే ఆ సమాచారం పోలీసులకు చేరవేయాలి అన్నారు, సమాచారం అందించిన వారు వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

## నేడు ఎంపీ మిథున్ రెడ్డి మంగంపేటకు రాక....

ఓబులవారిపల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి జన్మదిన సందర్భంగా మంగంపేట అగ్రహారంలో వెలసిన పురాతన దేవత కటపటాలమ్మను శుక్రవారం దర్శించుకుని ఆ తర్వాత భక్తులకు ప్రజలకు చీరలు పంపిణీ చేసి కేక్ కట్ చేసి అభిమానులతో జన్మదిన వేడుకలు జరుపుకుంటు న్నట్లు వైసిపి నాయకులు తెలిపారు అన్ని విధాల ప్రజలు బాగుండాలని ఈ జన్మదినం సందర్భంగా ముక్కోటి దేవతలను ప్రార్థిస్తున్నట్లు ఎంపీ మిథున్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు కార్యక్రమానికి వైసీపీ శ్రేణులు అభిమానులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నామన్నారు.



## నేడు ఎంపీటీసీ ఓటర్ల జాబితా ప్రచురణ

**ఎంపీడీవో కె. మోహన్**

**పెనగలూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**

తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండల ప్రజా పరిషత్ పరిధిలోని 11 ఎంపీటీసీ స్థానాలకు ఫోటో ఓటర్ల జాబితాను నేడు శుక్రవారం ప్రచురించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. మోహన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ జాబితాను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఎంపీటీసీ రెండో సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా రూపొందించిన ఈ పూర్తి స్థాయి ఫోటో ఓటర్ల జాబితాను నేడు అధికారికంగా ప్రచురించి, స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచనున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. మండల పరిధిలోని ఓటర్లు కార్యాలయానికి వచ్చి తమ వివరాలను సరిచూసుకోవాలని ఆయన కోరారు.

## ఆపద సమయంలో రక్తదానం దివ్య ఔషధం

**హార్టికల్చర్ కళాశాల అసోసియేట్ డీన్ పిటి శ్రీనివాస్**

**రైల్వే కోడూరు రూరల్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**

రైల్వే కోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ ఉద్యాన కళాశాల నందు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్త వారోత్సవాల్లో భాగంగా ఏడవ రోజున రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట నందు డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం నందు ఉద్యాన కళాశాలలో జేబీవీఎస్ ది ప్రెసివర్ మరియు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొనట్లు అసోసియేట్ ఢీన్ పిటి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం అనేది అత్యవసర సమయంలో ఒకరి ప్రాణాన్ని కాపాడే గొప్ప సామాజిక సేవ అని విద్యార్థి దశ నుంచి సేవా కార్యక్రమాల పట్ల అవగాహన పెంపొందించుకోవడం ద్వారా సమాజం పట్ల బాధ్యతమైన పౌరులుగా ఎదగవచ్చు అని ఆయన అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి హరి, మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన యువత రక్తదానం చేయడం ద్వారా రక్తం అవసరమైన వారికి అండగా నిలవడం మరియు ప్రాణాన్ని రక్షించినట్లుగా చెప్పవచ్చు అని అన్నారు. రక్తం అవసరమైన వారికి ఈ రక్త దానం ద్వారా ప్రాణాలను సులువుగా కాపాడవచ్చు అని వారు తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్ బి రమ్యలక్ష్మి మాట్లాడుతూ రక్తదానం విషయంలో విద్యార్థులలో అవగాహన కల్పించడంతోపాటు అవసరమైన సమయంలో సమాజానికి సేవ చేయాలనే భావనలు పెంపొందించుకోవడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు, సంస్థ సభ్యులు వీరాచారి, లేఖన్, విద్యార్థి దాతలు రక్తదాన శిబిరం జయప్రదం చేశారు.

## సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో 25 మందికి ఉద్యోగాలు

**క్యాంపస్ నియామకాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు**

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 10 ప్రభాత వార్త**



తిరుపతి రూరల్ మండలం సి.గొల్ల పల్లెలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు క్యాంపస్ నియామకాల్లో సత్తా చాటారు. కళాశాలలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న 25 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సంస్థ ప్రతినిధులు నిర్వహించిన పలు దశల ఎంపిక ప్రక్రియలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు సంస్థ ఆధారిత శిక్షణ అందించడంతో పాటు భవిష్యత్తులో ప్రముఖ సంస్థల్లో మరిన్ని ఉద్యోగ అవకాశాలు పొందేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ వై. ఆనందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. క్యాంపస్ నియామకాల్లో 25 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం సంతోషకరమన్నారు. విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కళాశాల తరఫున నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులోనూ మరిన్ని ప్రముఖ సంస్థలను కళాశాలకు తీసుకువచ్చి విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ స్వామినాథ్, శిక్షణ–నియామకాల అధికారి భాస్కర్ తదితరులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

## భాషపై పట్టు ఉంటేనే భవిష్యత్‌కు బలమైన పునాది

**విద్యార్థినులకు అవగాహన సదస్సులో నిపుణుల సూచనలు**

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 10 ప్రభాత వార్త**



భాషపై మంచి పట్టు ఉంటేనే విద్యార్థులు భవిష్యత్తులో ఎంచుకున్న రంగంలో మెరుగ్గా రాణించగలరని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. భువనేశ్వరి అన్నారు. కళాశాలలో గురువారం భాషా నైపుణ్యాలు, సంస్కృతి పరిరక్షణపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులకు భాషా నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ భువనేశ్వరి మాట్లాడుతూ జ్ఞానంతో పాటు భాషా నైపుణ్యం కూడా ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమన్నారు. విద్యార్థినులు సదస్సులో అందించిన సూచనలను సద్వినియోగం చేసుకుని తమ భాషా సామర్థ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ జయరామయ్య మాట్లాడుతూ విద్యార్థినులు వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం అనే నాలుగు భాషా నైపుణ్యాలపై మంచి పట్టు సాధించాలని సూచించారు. ఏ రంగంలో రాణించాలన్నా భాషా పరిజ్ఞానం కీలకమని పేర్కొన్నారు. మాతృభాషతో పాటు ఇతర భాషలపైనా నైపుణ్యం పెంపొందించుకుంటే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలను విస్తరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. యువత ఆలోచనా విధానం, జీవనశైలి, విలువలపైనే భవిష్యత్తు సమాజ స్వరూపం ఆధారపడి ఉంటుందని డాక్టర్ జయరామయ్య పేర్కొన్నారు. విద్య కేవలం ఉద్యోగం సాధించేందుకు మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శకంగా ఉండాలని అన్నారు. వ్యక్తిత్వ వికాసంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించుకున్నప్పుడే సంస్కృతి పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పలు సూచనలు అందించారు. అధ్యాపకులు డాక్టర్ జయమ్మ, మునేంద్ర, డాక్టర్ ధనమ్మ, డాక్టర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి మార్కెట్లోకి కియా సోరెంటో

**అధునాతన సాంకేతికత.. భద్రతా ఫీచర్లతో కొత్త కారు ఆవిష్కరణ**

**తిరుపతి విద్య సెప్టెంబర్ 10 ప్రభాత వార్త**



అధునాతన సాంకేతికత, ఆకర్షణీయమైన రూపకల్పన, ఆధునిక భద్రతా సదుపాయాలతో రూపొందించిన కియా సోరెంటో కారు తిరుపతి మార్కెట్లోకి అడుగు పెట్టింది. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలోని తూకివాకం వద్ద ఉన్న హోషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా కార్ల ప్రదర్శనశాలలో గురువారం నూతన కారును ఆవిష్కరించారు. కార్యక్రమానికి జిల్లా రవాణా అధికారి కె. మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరై కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కియా సోరెంటో ఆకర్షణీయమైన రూపకల్పనతో పాటు శక్తివంతమైన పనితీరు, అధునాతన సాంకే తిక సదుపాయాలతో రూపొందించబడిందని తెలిపారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు పేర్కొన్నారు. కారులో విశాలమైన, అధునాతన అంతర్గత సదుపాయాలతో పాటు పెద్ద స్పర్శ తెర, ఆధునిక వినోద వ్యవస్థ, వైర్‌లెస్ మొబైల్ అనుసంధాన సదు పాయం, 360 డిగ్రీల కెమెరా, పార్కింగ్ సెన్సర్లు వంటి సౌకర్యాలు ఉన్నాయని నిర్వా హకులు తెలి పారు. అధునాతన భద్రతా వ్యవస్థ, విశాలమైన పైకప్పు అద్దం, గాలి ప్రసరణతో కూడిన విద్యుత్ నియం త్రిత సీట్లు, బహుళ ప్రాంతాల ఉష్ణోగ్రత నియంత్రణ, అనుసంధానిత వాహన సాంకేతికత వంటి సదుపా యాలు కూడా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో హోషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి, డైరెక్టర్లు చెరకు నిరంజన్, సి.భారతి, సి. హోషిమారెడ్డి, సి. ఆశి ష్‌రెడ్డితో పాటు నూతన వినియోగదారులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. కియా సోరెంటో కారుకు బుకిం గ్‌లు ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వివరాలకు 8688829739 నంబర్‌ను సంప్రదిం చాలని సూచించారు.

## ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

**తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త**



ఎస్వి వైద్య కళాశాల, రుయా ఆస్పత్రి, మానసిక విభాగ ఆధ్వర్యంలో అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు ప్రిన్సిపాల్, డాక్టర్ జి.రవి ప్రభు, రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ బి మనోహర్, ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవి ప్రభు మాట్లాడుతూ, రుయా ఆసుపత్రి, మానసిక విభాగం మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం కలిసి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వలన మానసిక రోగులకు, మానసిక ఆందోళనలతో ఉన్నవారికి, కౌన్సిలింగ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం జరుపుకుంటున్నాము అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ బి మనోహర్ మాట్లాడుతూ ప్రపంచ ఆత్మహత్యలు నివారణ దినోత్సవం సందర్భంగా రుయా ప్రాంగణం నుంచి ఎస్ వి వైద్య కళాశాల వరకు అవగాహన భారీ ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఇలాంటి అవగాహన ర్యాలీలు నిర్వహించడం వలన మానసిక వ్యాధి, మత్తు వ్యసనాలకు, పాల్పడిన వారు, అవగాహన మరియు కౌన్సిలింగ్ ద్వారా మరలా వారి ఉత్తమైన జీవితాన్ని కొనసాగడానికి ఈ ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ అవగాహన ర్యాలీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మానసిక విభాగాధిపతి డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం. ప్రజలకు, రోగులకు, విద్యార్థినీ, విద్యార్థులకు, మరియు కార్పొరేట్ సంస్థల అధిపతులకు, మత్తు వ్యసనాలకు అలవాటు పడిన యువతకు, ఆత్మహత్యల నివారణ కొరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించుకోవడం ప్రతి సంవత్సరం మనము మానసిక విభాగం నుంచి అవగాహన కార్యక్రమాలు వ్యాసరచన పోటీలు ర్యాలీలు మరియు కౌన్సిలింగ్ ద్వారా ఆత్మహత్యలను మనం నివారిస్తున్నాము. అప్పుడే ప్రజలకు మనోధైర్యం కలిగి ఆత్మహత్యలు చేసుకోకుండా, మానసిక విభాగం వారు అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రతి మనిషిని మనం కాపాడుకోవచ్చు అని ఆమె తెలిపారు. స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజ్ విద్యార్థినిలకు క్విజ్ పోటీ నిర్వహించడం జరిగింది, క్విజ్ పోటీల్లో గెలిపిందని వారికి బహుమతులు ఎస్ వి వైద్య కళాశాల ప్రిన్సిపాల్, రుయా సూపరిటెండెంట్ చేతుల మీదుగా బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జున రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత, డాక్టర్ శారద, పీజీ వైద్య విద్యార్థులు, యూజీ వైద్య విద్యార్థులు, మత్తు వ్యసన నిర్మూలన సిబ్బంది, మత్తు పదార్థాల వ్యసనాల కౌన్సిలర్ మురళి, నర్సింగ్ కళాశాల సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినీ విద్యార్థులు, ఎస్ వి వైద్య కళాశాల పి.ఆర్‌ఓ వీర కిరణ్ తదుతరులు పాల్గొన్నారు. ఎలక్ట్రిక్ బస్సు డిపో నిర్మాణం పనులను పరిశీలించిన

## శ్రీ భద్రకాళి ఆలయంలో అమావాస్య పూజలు.

**చిట్వేలి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :**



స్థానిక పాత చిట్వేలి గ్రామంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయం నందు గురువారం ఆలయ పెద్దలు అమావాస్య పూజలను పెద్ద ఎత్తున నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి నిర్వహించిన ఈ పూజల్లో ముందుగా గణపతికి, నవగ్రహాలకు మరియు స్వామి అమ్మవార్లకు హోమం నిర్వహించారు. తదుపరి కలశాభిషేకం, అభిషేకం చేపట్టారు. అర్చకులు మృత్యుంజయ స్వామి అమ్మవారి ప్రత్యేక రూపాలకు విశేష అలంకరణ చేశారు, పెద్ద ఎత్తున భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక హారతితో కార్యక్రమం ముగించారు. ఆలయ పెద్దలు భక్తులకు అల్పాహార విందును ఏర్పాటు చేశారు.

# తిరుపతి డివిజన్

## సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు

**అశ్వమేధ కళాశాలలో ఆత్మహత్యల నివారణపై అవగాహన**

**తిరుపతి విద్య సెప్టెంబర్ 10 ప్రభాత వార్త**



జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, ప్రతి సమస్యకు ఏదో ఒక పరిష్కార మార్గం ఉంటుందని జిల్లా బాలల రక్షణ విభాగం ప్రతినిధులు విద్యార్థులకు సూచించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఎం.ఆర్.పల్లి అశ్వమేధ జూనియర్ కళాశాల బాలుర ప్రాంగణంలో జిల్లా బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మానసిక ధైర్యం, సమస్యలను సానుకూలంగా ఎదుర్కొనే విధానంపై అవగాహన కల్పించారు. చిన్నచిన్న సమస్యలు, కష్టాలు ఎదురైనప్పుడు తీవ్ర నిర్ణయాలకు వెళ్లకుండా కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన వ్యక్తులతో తమ సమస్యలను పంచుకోవాలని సూచించారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని, పరిష్కార మార్గాలను అన్వేషించాలన్నారు. అదేవిధంగా బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు, పిల్లల హక్కులు, వారికి అందుబాటులో ఉన్న రక్షణ వ్యవస్థలపై విద్యార్థులకు వివరించారు. తమకు ఎదురయ్యే ఇబ్బందులను దాచిపెట్టకుండా బాధ్యత కలిగిన పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు అబ్దుల్ ఇష్రత్, గోవర్ధన్, సహాయ ప్రధాన నిర్వాహకులు మోహన్‌బాబు, జిల్లా బాలల రక్షణ విభాగం న్యాయ–పరివీక్షణ అధికారి శోభారాణి, సామాజిక కార్యకర్త మునికోకిల, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో మానసిక ధైర్యాన్ని పెంపొందించడంతో పాటు సమస్యలను సానుకూల దృక్పథంతో ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం, బాలల హక్కులు, రక్షణ వ్యవస్థలపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## ఉద్యోగుల ఆత్మీయతకు అద్దం పట్టిన జన్మదిన వేడుక

**బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌కు ఘన సత్కారం**



**తిరుపతి విద్య, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్షులు శ్రీధర్ గుర్రంకొండ జన్మదిన వేడుకలు విశ్వవిద్యాలయంలో ఆత్మీయ వాతావరణంలో జరిగాయి. సంఘం నాయకులు, వివిధ విభాగాల ఉద్యోగులు కలిసి ఆయనను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ గుర్రంకొండకు దుశ్శాలువ కప్పి, పూలమాల వేసి సత్కరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘం తరఫున ముందుండి పనిచేయాలని, ఆయనకు మంచి ఆరోగ్యం, సంతోషం కలగాలని పలువురు ఆకాంక్షి ంచారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సంయుక్త రిజిస్ట్రార్ చంద్రయ్య, బోధనేతర సిబ్బంది సంఘం ఉపాధ్యక్షులు కోటాగారం మురళి, సంయుక్త కార్యదర్శి ముత్తువేలు, కోశాధికారి గురుప్రసాద్ పాల్గొన్నారు. ఎన్ఎంఆర్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జయచంద్ర, సిద్ధు, ఉపాధ్యక్షులు జగదీష్, సంయుక్త కార్యదర్శి రమేష్, హాస్టల్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, మాజీ అధ్యక్షులు నాగరాజుతో పాటు పలువురు హాస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు. అఖిల భారత విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమాఖ్య జాతీయ సదస్సుకు వెళ్లిన బోధనేతర సిబ్బంది సంఘం కార్యదర్శి నెల్లూరు సుబ్రహ్మణ్యం, ప్రచార సమన్వయకర్త మనోజ్‌కుమార్ సింగ్ ఫోన్ ద్వారా శ్రీధర్ గుర్రంకొండకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## చిన్నారుల పోషణపై తల్లులకు అవగాహన

**అంగన్వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్న పోషకాహార మాసోత్సవాలు**



**తిరుపతి విద్య సెప్టెంబర్ 10 ప్రభాత వార్త**

చిన్నారులకు పోషకాహారాన్ని అందించడంతో పాటు వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలపై తల్లుల్లో అవగాహన పెంచేందుకు అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలు కొనసాగుతున్నాయి. తిరుపతి రాష్ట్ర ప్రాజెక్టు పరిధిలోని 121 అంగన్వాడీ కేంద్రాల్లో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నెలరోజులపాటు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మాసోత్సవాల్లో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో తల్లుల సమావేశాలు నిర్వహించి పిల్లలకు అందించాల్సిన సమతుల్య, వైవిధ్యమైన ఆహారంపై అవగాహన కల్పిస్తున్నారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు కేంద్రాల్లో అందిస్తున్న వేడిగా వండిన పౌష్టికాహారం, పిల్లల పోషణలో కుటుంబం, సమాజం భాగస్వామ్యం, ప్రాథమిక విద్య, బాలల వికాసం వంటి అంశాలను తల్లులకు వివరిస్తున్నారు. ఇందులో భాగంగా ఎస్‌కేడీ నగర్ అంగన్వాడీ కేంద్రంలో పర్యవేక్షకురాలు హేమ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పిల్లల ఆరోగ్యం, పోషణకు సంబంధించిన అంశాలపై తల్లులకు అవగాహన కల్పించారు. అలాగే క్రాంతినగర్ అంగన్వాడీ కేంద్రంలో పర్యవేక్షకులు శ్రీదేవి, మాధురి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో తల్లులు, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై కూడా ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం, మాతృ సంరక్షణ, ప్రధానమంత్రి మాతృ వందన పథకం తదితర అంశాలను వివరించనున్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే చిన్ననాటి నుంచే సరైన పోషకాహారం అందించాల్సిన అవసరాన్ని తల్లులకు తెలియజేస్తున్నారు. ప్రతి అంగన్వాడీ కార్యకర్త తన పరిధిలోని తల్లులతో సమావేశాలు నిర్వహించి పిల్లల పోషణ, ఆరోగ్య సంరక్షణపై అవసరమైన సూచనలు అందిస్తున్నారు. నెలరోజులపాటు కొనసాగే ఈ కార్యక్రమాల ద్వారా చిన్నారుల ఆరోగ్యం, పోషణపై కుటుంబాల్లో మరింత అవగాహన పెంచడమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టారు.

## ఉపాధ్యాయురాలు సురలక్ష్మికి ఘన సన్మానం

**విజయపురం, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:**



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత గాదిరాజు సురలక్ష్మి సేవలు ప్రశంసనీయమని ప్రధానోపాధ్యాయుడు వెంకమరాజు పేర్కొన్నారు. గురువారం విజయపురం మండలం శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. సురలక్ష్మి 31 సంవత్సరాలు విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించారని ఎందరో విద్యార్థులకు ఉన్నతికి కృషి చేశారని వక్తలు పేర్కొన్నారు. సురలక్ష్మిని విద్యా కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు విజయచంద్రిక, రాధాకుమారి, వెంకటేష్, గోపి, విజయవర్మ, సురేష్, సుబ్రహ్మణ్యం, సుజాత, మోహన్‌బాబు, మదన్‌మోహన్ కుమార్, లోకయ్య, మహదేవన్, సుబ్బులక్ష్మి, రేవతి కుమారి, మని, రుబాన్, వేలు, దశరథ, చంద్రరెడ్డి ఘనంగా సన్మానించారు.

